Visakha Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 99487 49799

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 92 విశాఖపట్నం, 15 జనవరి 2024 సోమవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00




# ఉత్తరాంధ్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



భోగిమంట వెలిగించిన అనంతరం సాంస్కృతిక గ్రామం మరియు సంక్రాంతి సంబరాలప్రాంగణాన్ని నిర్మించిన నగేష్‌ను అభినందిస్తున్న నటుడు సాయికుమార్, బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు దంపతులు, కరణంరెడ్డి నరసింగరావు తదితరులు.

## జీవీఎల్ దంపతులచే భోగిమంట ప్రజ్వలన

సూర్య భగవానుడు మకర రాశిలో ప్రవేశించే ముందు రోజు పవిత్రమైన అగ్నిని ప్రజ్వలింపజేసి వాతావరణ కాలుష్యాన్ని నిర్మూలిస్తూ, సూర్యుడికి అర్ఘ్యం ఇచ్చే పవిత్రమైన భోగిమంట ప్రజ్వలన కార్యక్రమం ఆదివారం ఉదయం బీజేపి ఎం.పి. శ్రీ జీవీఎల్ నరసింహారావు దంపతుల చేతుల మీదుగా అట్టహాసంగా జరిగింది. తెల్లవారుఝామున ఐదు గంటలకు సుమారు 100 మంది నవ వధూవరులచే భోగిపిడకలు వేయిస్తూ, హాజరైన ప్రతి ఒక్కరినీ ఆదరిస్తూ జీవీఎల్ దంపతులు శోభకృత్ నామ సంవత్సర భోగి పండుగను జీవీఎల్ మహా సంక్రాంతి సంబరాల వేదిక సమీపంలో ప్రారంభించారు. జాజ్వల్యమానంగా అగ్ని జ్వాలలు ప్రజ్వరిల్లి తెల్లవారుఝామున ఐదు గంటలకే ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్ భోగి వెలుగులలో నవ క్రాంతులు సంతరించుకున్నాయి.

ప్రఖ్యాత సినీ కళాకారులు సాయి కుమార్ తన బృందంతో వచ్చి ఉదయం ఆరు గంటలకే ఈ కార్యక్రమంలో పాల్గొని సందర్శకులందరికీ అక్షయ పాత్ర ఫౌండేషన్ వారు తయారు చేసిన శ్రీకృష్ణ పరబ్రహ్మ నివేదిత ప్రసాదాలను అందరికీ పంచారు. సుమారు 2000ల మందికి పైగా నగర ప్రజలు ఈ వేడుకలో పాల్గొని హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అర్జున్ మేఘవాల్



ధింసా నృత్య కళాకారులతో బిజేపి ఎంపీ జీవీఎల్, కేంద్ర మంత్రి అర్జున్ మేఘవాల్



కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న రాజస్థాన్ సాంస్కృతిక మండలి సభ్యులు



న్యాయ శాఖా మంత్రికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఏపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ -2002 జీవోను రద్దు చేయాలని కోరుతూ వినతి పత్రం ఇస్తున్న స్థానిక న్యాయవాదులు.

## నేడు సంక్రాంతి వేడుకలు

మకర సంక్రాంతి వేడుకలకు ఇంజనీరింగ్ కళాశాల మైదానం కొత్త ముస్తాబులు చేకూర్చుకుంది. రోజు రోజుకీ పెరుగుతున్న సందర్శకుల ఆనందాలకు అనుగుణంగా టీం జీవీఎల్ బృందం ప్రాంగణంలో నూతన ఆవిష్కరణలు జరిపిస్తోంది. ప్రాంగణమంతా చెరుకు గడలతో కళకళలాడుతోంది. సుమారు 150కి పైగా దుకాణములతో అత్యంత సరసమైన ధరలతో చేనేత వస్త్ర దుకాణాల ప్రాంగణం కిటకిటలాడుతోంది. తినుబండారాలు అనేక రకాలుగా సందర్శకులకు విందు చేస్తున్నాయి.

ధింసా నృత్యాలు, తప్పెటగుళ్ళు, కోలాటాలు, పులివేషాలు, మేజిక్‌షోలు ప్రాంగణమంతా హోరెత్తిస్తాయి. సోమవారం సాయంత్రం సాంస్కృతిక కళావేదికపై అతిపెద్ద సంగీత విభావరి, ప్రఖ్యాత గాయనీ గాయకులతో ప్రేక్షకులను సంగీత సాగరంలో ఓలలాడిస్తుంది.

వివిధ రకాల నృత్య కళాశాలల నుండి వందలాది మంది నర్తకీమణులు తమ నృత్యాలను ప్రదర్శించి కనువిందు చేస్తారు.

ఈ కార్యక్రమాలను చూసి ఆనందించవలసిందిగా టీం జీవీఎల్ అధ్యక్షులు, బీజేపి ఎం.పి జీవీఎల్ నరసింహారావు అందరినీ ఆహ్వానిస్తున్నారు.

## భోగిపండ్ల వేడుకలో కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్

కేంద్ర న్యాయశాఖామాత్యులు అర్జున్ మేఘ్‌వాల్ జీవీఎల్ మహా సంక్రాంతి వేడుకకు ఆదివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాయంత్రం ప్రాంగణంలో జరిగిన పసిపాపలకు భోగిపండ్ల వేడుకలో ఆయన ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వయంగా రేగుపండ్లు, నాణెములు, పువ్వులు కలిపిన సామగ్రితో బాలలందరికీ దిష్టి తీసి వారిని ఘనంగా ఆశీర్వదించారు. బాలల తల్లిదండ్రులంతా మంత్రికి కృతజ్ఞత తెలియజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మేఘ్‌వాల్ మాట్లాడుతూ చిన్నపిల్లలకు ఇలా భోగిపండ్ల ఆశీర్వాదం దేశంలో ఎక్కడా జరపరని, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఇటువంటి సాంప్రదాయ వేడుక జరగడం అభినందనీయమని, భోగిపండ్లతో స్నానం ద్వారా పిల్లలకు సూర్యతేజస్సు లభిస్తుందని, వారిలో జ్ఞాననేత్రం చురుకుగా పనిచేస్తుందని అన్నారు. ప్రపంచానికి యోగా విద్యను నేర్పింది భారతీయులేనని, కుటుంబ సాంప్రదాయానికి, గౌరవప్రదమైన జీవితానికి భారతదేశ సాంప్రదాయాలు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. తల్లిదండ్రులు, అన్నదమ్ములతో ఎలా కలిసి మెలిసి జీవించాలో శ్రీరామచంద్ర ప్రభువు మనకు నేర్పించారని అన్నారు. అంతే కాక, తన స్పందనను భజన గీతాలు పాడుతూ తెలియజేశారు.

మంత్రి ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు నేడు ప్రపంచానికే ఆదర్శంగా నిలిపాయని, భారత్ విశ్వ గురువుగా అవతరించిందని, ప్రపంచ సాంస్కృతిక నాయకత్వం ఈ రోజు భారత్‌కు లభించిందని అన్నారు. అంతరిక్ష పరిశోధనలలో కూడా మన దేశం అగ్రగామిగా నిలిచిందని భావితరానికి బలమైన పునాదులు సంస్కృతీ సంప్రదాయాలతోనే ఏర్పడతాయని, వారసత్వ సంపదను మనం కాపాడుకుంటూ భావి తరాలకు అందించాలని అన్నారు. 500 ఏళ్ళ అనంతరం అయోధ్యలో తిరిగి రాముడు పూజలు అందుకోబోతున్నాడని, ఇది దేశ శాంతి సౌభాగ్యాలకు తొలి పండుగ అని అన్నారు.

టీం జీవీఎల్ అధ్యక్షులు, బీజేపి ఎంపి జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ తన ఆహ్వానాన్ని మన్నించి కేంద్రమంత్రి అర్జున్ మేఘ్‌వాల్ ఈ కార్యక్రమానికి హాజరవ్వడమే కాకుండా గొప్ప సందేశాన్ని ఇచ్చారని, మేఘ్‌వాల్ ప్రసంగంతో మనం దేశ భవిష్యత్తు కోసం నిమగ్నం కావాలని అన్నారు. పండుగ వేళ కేంద్ర మంత్రి విశాఖపట్నం సందర్శించడం, ప్రజలందరినీ అభినందించడం శుభసూచకం అన్నారు. మూడు రోజులుగా నడుస్తున్న సంక్రాంతి సంబరాలు సోమవారం సాయంత్రం ముగియనున్నాయని, సోమవారం కూడా ఎంతో ఆకర్షణీయంగా సంక్రాంతి సంబరాలు జరుగుతాయని, నగర ప్రజలంతా విచ్చేసి సంక్రాంతి అనుభూతిని పొందాలని కోరారు.



## విశాఖ ఉక్కు కర్మాగారంలో ప్రమాదం



బ్లాస్ట్ ఫర్నేస్ వద్ద ఎగసిపడుతున్న మంటలు

విశాఖపట్నం,విశాఖసమాచారం: ఉక్కు కర్మాగారం బ్లాస్ట్‌ఫర్నేస్-3 (బీఎఫ్-3) స్లాగ్ గ్రాన్యులేషన్ ప్లాంట్(ఎస్‌జీపీ)లో శనివారం అగ్నిప్రమాదం సంభవించింది. ఇటీవలే బీఎఫ్-3ని వినియోగంలోకి తీసుకొచ్చారు. అక్కడ నిరంతర ఉత్పత్తికి పనులు జరుగుతున్నాయి. ఫర్నేస్‌లో తయారయ్యే స్లాగ్ (ఇసుక వంటి పదార్థం)ను సాధారణంగా ఎస్‌జీపీకి పంపుతుంటారు. ఈ క్రమంలో ఏదైనా సమస్య తలెత్తితే స్లాగ్‌ను బయట నిర్మించిన స్లాగ్ పిట్‌లో పోస్తారు. స్లాగ్ పిట్ కొంతకాలంగా ఖాళీగా ఉండటంతో చెత్తాచెదారం అందులో చేరింది. పిచ్చిమొక్కలు పెరిగాయి. శనివారం వేడి స్లాగ్ అందులో వేయగానే ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. పెద్దఎత్తున మంటలు ఎగసి పడడంతో ఏం జరిగిందో తెలియక కార్మికులు, ఉద్యోగులు పరుగు తీశారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని, యంత్రాలకూ నష్టం వాటిల్లలేదని, ఉత్పత్తికి ఆటంకం లేదని పరిశ్రమ యాజమాన్యం ఓ ప్రకటన విడుదల చేసింది.

## చిల్ల హరి ఆధ్వర్యంలో చీరలు పంపిణీ



భీమునిపట్నం (విశాఖసమాచారమ్) జనవరి 14:భీమునిపట్నం మండలం తాళ్లవలస పంచాయతీలో గల ఎరుసుపేట గ్రామం వైకాపా పార్టీ 3వ వార్డు నెంబర్ ఎరుసు గోవిందరెడ్డి చేతుల మీదుగా సంక్రాంతి పండగ సందర్భముగా పేద మహిళలకు చీరలు పంచటం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా వైకాపా నాయకులు బోయి సత్యనారాయణ, ఎరుసు శ్రీనివాస్ రెడ్డి, ఎరుసు ప్రకాష్, బోయి దుర్గారెడ్డి, దుంప గురుమూర్తి రెడ్డి, బోయి అప్పల రెడ్డి మొదలగున వారు పాల్గొన్నారు.

## భార్య ఘాతుకానికి భర్త బలి



విశాఖసమాచారమ్:కశింకోట: పది సెంట్ల స్థలం కోసం మద్యంలో పురుగు మందు కలిపి భర్తను హత్యచేసిన సంఘటన బయ్యవరంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. కశింకోట సీఐ వినోద్‌బాబు కథనం ప్రకారం.. ఈ గ్రామానికి చెందిన బరుకు గోవింద (43)కు 2015లో ఎలమంచిలికి చెందిన శివలక్ష్మితో వివాహమైంది. వీరికి పిల్లలు లేరు. భార్యాభర్తలు తరచూ తగదా పడుతుండేవారు. జాతీయ రహదారి పక్కన ఉన్న 10 సెంట్ల స్థలాన్ని అమ్మమని భర్తను ఆమె ఒత్తిడి చేసేది. ఆ స్థలాన్ని అమ్మబోనని ఆయన తెగేసి చెప్పడంతో శుక్రవారం రాత్రి మద్యంలో పురుగుల మందు కలిపి తాగించింది. తెల్లవారుజామున శబ్దం రావడంతో అతని తల్లి వెంకయ్యమ్మ వచ్చి చూడగా గోవింద నోటివెంట నురగలు ఉయి. దీంతో ఇరుగుపొరుగు వారిని పిలిచింది. వారు వచ్చి పరిశీలించగా పురుగు మందు వాసన వచ్చింది. వారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే డీఎస్పీ సుబ్బరాజు, సీఐ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. అతని తల్లి వెంకయమ్మ తన కుమారుడి హత్యకు కోడలు శివలక్ష్మి కారణమని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ కోణంలో డీఎస్పీ దర్యాప్తు ప్రారంభించారు. వేలిముద్రల నిపుణులు, డాగ్‌స్క్వాడ్ సంఘటనా స్థలానికి రప్పించారు. స్థానికుల నుంచి వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్యను అదుపులోకి తీసుకొని విచారించగా హత్య చేసినట్లు అంగీకరించినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## వైకాపా నేతల ఆస్తులున్న ప్రాంతాల్లో అభివృద్ధి



విశాఖసమాచారం: పన్నుల భారం మోపి ముక్కుపిండి వసూలు చేసిన ప్రజల సొమ్ములతో వైకాపా నేతల ఆస్తులున్న ప్రాంతాల్లో సోకులద్దుతున్నారు. టెండర్లు పిలిచి ఆగమేఘాలపై రూ.కోట్లు కుమ్మరిస్తున్నారు.

**ఇరవై రహదారులకు ఆగమేఘాలపై రూ. 160 కోట్ల కేటాయింపు**

మహా విశాఖ నగరపాలక సంస్థకు ఏటా 15శాతం పన్నులు పెరిగేలా ఆస్తి విలువ ఆధారిత నూతన పన్ను విధానం అమలు చేశారు. ప్రజలు చెల్లించే సొమ్ము నేరుగా జీవీఎంసీ కమిషనర్ ఖాతాలో జమవుతుంది. ఇలా వచ్చిన పన్ను సొమ్ముతో నేతల ఆస్తులకు లాభం కలిగేలా రాచబాటలు పరుస్తున్నారు. విలీన గ్రామాల్లో ఎన్నో రహదారులు గుంతలమయంగా మారి ప్రయాణం అంటేనే నరకం చూపిస్తున్నా వాటిపై దృష్టి పెట్టలేదు. మరో వైపు నగరంలో 20 రహదారులను రూ.160కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక చేశారు. పనుల వివరాలు కానీ, ప్రతిపాదనలు కానీ జీవీఎంసీలో పాలకవర్గం సభ్యులందరికీ తెలియకపోవడం గమనార్హం. కేవలం ఎమ్మెల్యేలు, వైకాపా ఇన్‌ఛార్జిలు ఇచ్చిన ప్రతిపాదనలను కౌన్సిల్‌లో పెట్టి తీర్మానం చేయడంతోపాటు, టెండర్లు ఆహ్వానించి చకచకా ముందుకు సాగుతున్నారు. కీలకమైన కొందరు కార్పొరేటర్లు అసంతృప్తి వ్యక్తం చేయకుండా ఉండేందుకు వారి వార్డుల్లో కొన్ని పనులు చేపడుతున్నారు.

ధరపెరిగేలా..: కూర్మన్నపాలెంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ భవంతులు నిర్మిస్తున్న ప్రాంతానికి సమీపంలో రహదారులను రూ.8కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. ఈ రహదారుల ప్రతిపాదనలు స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులకూ తెలియకపోవడం విశేషం. ప్రస్తుతం అమ్మకం దశలో ఉన్న గృహాల ధర అమాంతం పెరగనుంది. ఆయా ప్రతిపాదనలను ఎంపీ సత్యనారాయణ పెడితే...వాటిని కౌన్సిల్‌లో ఆమోదించారు. మరో వైపు ఎండాడలో ఎంపీకి చెందిన మూడు వెంచర్ల వద్ద రూ.5కోట్లతో, పీఎంపాలెం స్టేడియానికి ఎదురుగా మరో రూ.5కోట్లతో, హయగ్రీవ ప్రాజెక్టు సమీపంలో మూడు రహదారులను రూ.3కోట్లతో ప్రతిపాదించారు.

**కౌన్సిల్‌లో రగడైనా ఆగడం లేదు:** విశాఖ దక్షిణ నియోజకవర్గంలో తెదేపా ఎమ్మెల్యేగా గెలిచి వైకాపాకు మద్దతిచ్చిన వాసుపల్లి గణేష్‌కుమార్‌కు నరవలో రెండు ఎకరాల స్థలం ఉంది. ఇక్కడ కూడా రూ.4 కోట్లతో రహదారి నిర్మించాలనుకున్నారు. ఇది పూర్తయితే ఆ స్థలం విలువ 20-30శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయి. ఈ ప్రాంతంలో ప్రజలు నిత్యం ప్రయాణించే ప్రాంతంలో కాకుండా, కేవలం స్థలానికి కలిసొచ్చేలా రహదారి నిర్మిస్తున్నారని ప్రతిపక్ష కార్పొరేటర్లు కౌన్సిల్‌లో రగడ చేసినా, విన్నవించినా పట్టించుకోలేదు. మిలటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ స్థలం మీదుగా దీనిని నిర్మించాల్సి ఉండటంతో అనుమతులు కావాల్సి వచ్చింది. అవి రాకపోవడంతో శంకుస్థాపన కూడా ఆగిపోయింది.

పెద్దలకు మేలు జరిగేలా..: ముఖ్యమంత్రి జగన్ చిన్నాన్నకు చెందిన వెంచర్ చుట్టుపక్కల రూ.8 కోట్లతో రహదారులు నిర్మిస్తున్నారు. భీమిలి 4వ వార్డు పరిధిలో అనేక గ్రామాలకు రహదారులు లేకపోయినా ... నూతనంగా వేస్తున్న ఈ వెంచర్ వైపు రాకపోకలు సునాయాసంగా సాగటానికి వీలుగా రహదారులు చేపట్టారు. ఇక్కడ ఒకే ప్రాంతంలో నాలుగు రహదారులు ప్రతిపాదించడంపై ప్రతిపక్ష కార్పొరేటర్లు తప్పుపట్టినా, వాటిని ఆమోదించడం గమనార్హం. జీవీఎంసీ పరిధిలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు చెందిన ఓ గెస్ట్ హౌస్ ఉన్న ప్రాంతంలో ర

హదారి నిర్మాణానికి రూ.కోటి నిధులు జీవీఎంసీ కేటాయించింది. ప్రతిపాదన కూడా ఆయనే చేయడం గమనార్హం. దసపల్లాహిల్స్ ప్రాంతంలో రూ.4.60 కోట్లు, మంత్రి ధర్మాన ప్రసాదరావు స్థలాల వైపు రూ.40 లక్షలతో రోడ్లకు ప్రతిపాదనలు చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.5కోట్లతో శివాజీపార్కు రహదారిలో ప్రభుత్వ విప్ శ్రీకాంత్‌రెడ్డి సాగిస్తున్న నిర్మాణాలకు విలువ పెరిగేలా తారు రోడ్డు పనులు చేపట్టారు. ఉత్తర నియోజకవర్గంలోనూ ఇలాగే రూ.20 కోట్లకుపైగా వ్యయంతో నిర్మిస్తున్నారు.

## కోనసీమ జిల్లా అమలాపురానికి ఆ అల్లుడు రోల్స్ రాయిస్ కారులో ఎంట్రీ



రెండు తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండగ కోలాహలం నెలకొంది. ఇప్పటికే నగరాలు ఖాళీ అయ్యాయి. హైదరాబాదీయులు ఏపీ వైపు పరుగులు తీశారు. ఈ పండగను తమ ఆత్మీయుల మధ్య జరుపుకొంటోన్నారు. భోగీ మంటలు, సంక్రాంతి ముగ్గులతో పల్లెటూళ్లు సందడిగా మారాయి. సరికొత్త కళను సంతరించుకున్నాయి.

సంక్రాంతి పండగకు అల్లుళ్లు.. అత్తవారింటికి రావడం ఆనవాయితీగా వస్తోన్న విషయం తెలిసిందే. అల్లుళ్లకు తమ మర్యాదలతో ఉక్కిరిబిక్కిరి చేస్తుంటారు అత్తారింటోళ్లు. గత సీజన్‌లో అత్తారింటివారు కొత్త అల్లుడికి చేసిన మర్యాదలు.. ఇప్పటికీ మర్చిపోవట్లేదు ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రజలు.

సంక్రాంతికి ఇంటికి వచ్చిన అల్లుడికి 173 వంటకాలతో మర్యాద చేశారు. అప్పట్లో ఆ విందు వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. తటవర్తి బద్రి, సంధ్య అల్లుడు పృథ్వీ గుప్తాకు ఇచ్చిన మర్యాద అది. పెళ్లి తరువాత వచ్చిన తొలి సంక్రాంతి కావడంతో అల్లుడికి 173 వంటకాలతో మర్యాద చేశారు.

ఇప్పుడు తాజాగా అలాంటి ఉదంతమే చోటు చేసుకుంది. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి ఆ అల్లుడు రోల్స్ రాయిస్ కారులో ఎంట్రీ ఇవ్వడమే దీనికి కారణం. గోల్డ్ కలర్ రోల్స్ రాయిస్ కారులో ఊరికి వచ్చిన అల్లుడికి గ్రాండ్‌గా వెల్కమ్ పలికారు ఆయన బంధువులు.

బాణాసంచా కాల్చారు. స్వీట్లను పంచిపెట్టారు. ఆ కారు ధర 12 కోట్ల రూపాయలు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అతి కొద్ది మంది మాత్రమే ఈ రేంజ్ కారును వాడుతున్నారు. ఆదిత్యరామ్ మూవీస్ అధినేత ఆదిత్యరామ్‌గా చెబుతున్నారు. అమలాపురం వీధుల్లో రోల్స్ రాయిస్ కారు పరుగులు పెట్టడం అందరినీ ఆకర్షించింది. కారుతో సెల్ఫీ దిగారు.

## పంచాంగం

సోమవారం 15-01-2024
శోభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం హేమంత ఋతువు
పుష్య మాసం

తిథి : శు. చవితి ఉ. 10.04
నక్షత్రం : శతభిషం ప. 01.13
వర్జ్యం : రా. 07.01 ల 08.31

## కాక్‌పిట్ అద్దంలో పగుళ్లు.. మరో బోయింగ్ విమానం అత్యవసర ల్యాండింగ్



టోక్యో: అమెరికాలో గత వారం అలస్కా ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమాన డోర్ ప్లగ్ గగనతలంలో ఊడిపోయిన తర్వాత.. బోయింగ్ 737 మ్యాక్స్‌లను అన్ని దేశాలు పక్కన పెట్టేశాయి. కానీ, ఆ సంస్థకు చెందిన ఇతర విమానాల్లో లోపాలు బయటపడుతూనే ఉన్నాయి. శనివారం జపాన్‌లో ఆల్ నిప్పాన్ ఎయిర్‌వేస్‌కు చెందిన బోయింగ్ 737-800 కాక్‌పిట్ అద్దంలో పగుళ్లు గుర్తించిన పైలట్లు.. విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారని సంస్థ తెలిపింది.

"సపోరో-న్యూ చిటోస్ నుంచి తొయామకు బయల్దేరిన ఫ్లైట్ 1182 గాల్లోకి ఎగిరిన కొద్దిసేపటికే.. నాలుగు లేయర్లు కలిగిన కాక్‌పిట్ అద్దంలో పగుళ్లు వెలుగు చూశాయి. అప్రమత్తమైన పైలట్లు విమానాన్ని వెంటనే వెనక్కి మళ్లించారు. ఘటన జరిగిన సమయంలో విమానంలో ఆరుగురు సిబ్బంది సహా 59 మంది ప్రయాణికులు ఉన్నారు. ఇది బోయింగ్ 737 మ్యాక్స్ 9 శ్రేణిలోనిది కాదు" అని ఎయిర్‌లైన్స్ ఒక ప్రకటనలో తెలిపింది.

అలస్కా విమాన ఘటన తర్వాత బోయింగ్ 737 మ్యాక్స్ 9 విమానాలను అమెరికాకు చెందిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ఆకాశంలోకి ఎగరనీయకుండా కట్టడి చేసింది. తాజాగా వీటిపై ఆంక్షలను మరింత కాలం పొడిగించింది. మరిన్ని భద్రతా పరీక్షల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. భారత్‌లోనూ వైమానిక రంగ నియంత్రణ సంస్థ డీజీసీఏ దీనిపై దృష్టి పెట్టింది. అత్యవసర ద్వారాలను తక్షణమే తనిఖీ చేయాలని దేశీయ ఎయిర్‌లైన్స్ సంస్థలకు గత వారం మార్గదర్శకాలు జారీ చేసింది. దేశంలో ఈ రకం విమానాలు మొత్తం 40 ఉన్నాయి. వీటిని ఆకాశ ఎయిర్ (22), స్పైస్ జెట్ (9), ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ (9) నడుపుతున్నాయి.

# విశాఖ సమాచారమ్

సోమవారం 15-01-2024


## సంక్రాంతి రహస్యం

సంక్రాంతి రోజున మీకు పట్టిన శనిని ఇలా వదిలించేసుకోండి.

నెలరోజులకో రాశిలో సంచరించే సూర్యుడు… ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి అడుగుపెట్టినప్పుడు జరుపుకునే పండుగే మకర సంక్రాంతి.

**2024 జనవరి 15న**

సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశిస్తాడు.మకర రాశికి అధిపతి శని…శని ఎవరో కాదు సాక్షాత్తూ ఆ సూర్య భగవానుడి కుమారుడు. అందుకే సంక్రాంతి రోజు కొన్ని నియమాలు పాటించడం ద్వారా జాతకంలో శని ప్రభావం .. ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని ఉన్నవారు సంక్రాంతి సందర్భంగా ఇలా చేస్తే ఆ శని ప్రభావం తగ్గుతుంది.

**శని ప్రభావం మసకబారే సమయం**

సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయణం వైపు తన దిశ మార్చుకున్నప్పుడు తన కుమారుడైన శనితో కలిసి దాదాపు నెలరోజులు ఉంటాడని పండితులు చెబుతారు. ఆ నెల రోజులు సూర్యుడి తేజస్సు ముందు శని తేజస్సు మసకబారుతుంది..అంటే శని ప్రభావం తగ్గుతుంది.

**నువ్వులు**

పురాణాల్లో చెప్పిన విషయాల ప్రకారం సంక్రాంతి రోజున తన ఇంటికి వచ్చిన తండ్రి సూర్య భగవానుడికి శని..తనకు ఇష్టమైన నల్ల నువ్వులతో స్వాగతం పలుకుతాడు. సంతోషించిన సూర్యుడు.. ఈ రోజు ఎవరైతే తనకు నల్ల నువ్వులు సమర్పిస్తారో వారికి శని బాధలు తొలగి, సుఖ సంతోషాలతో, ఐశ్వర్యంతో వర్ధిల్లుతారని చెప్పాడట. అందుకే ఏటా మకర సంక్రాంతి రోజు సూర్యుడి పూజలో నల్ల నువ్వులు ఉపయోగిస్తారని చెబుతారు. సూర్యుడికి, శనికి ప్రీతికరమైన నల్లనువ్వులను సంక్రాంతి రోజు ధారపోసినా, దానమిచ్చినా శని బాధల నుంచి ఉపశమనం లభించి వారి జీవితంలో వెలుగులు ప్రసరిస్తాయని చెబుతారు.

**దానం - పూజ**

మకర సంక్రాంతి రోజు చేసే దానం, పూజకు రెట్టింపు ఫలితం ఉంటుందని చెబుతారు. అందుకే సంక్రాంతి రోజు సూర్యోదయానికి ముందే నిద్రలేచి స్నానమాచరించి నల్లనువ్వులు కలిపిన నీటిని సూర్యుడికి సమర్పించాలి. ఆ తర్వాత శనిని తలుచుకుని నువ్వులు సమర్పించాలి.

పూజ పూర్తైన తర్వాత ఆవనూనె, నల్ల నువ్వులు, నువ్వుల లడ్డూ.. ఎవరికైనా దానం ఇచ్చినా శని బాధలనుంచి విముక్తి లభిస్తుంది.

## సైనికుల్లా పనిచేసి చంద్రబాబును గెలిపించాలి




విజయ సంతేతం చూపుతున్న తేజస్వి, నాగేశ్వరరావు, ఐటీ ఉద్యోగులు

'సాఫ్ట్‌వేర్ యువత ఒక్కొక్కరు వంద మందిని ప్రభావితం చేయగలరు. రాష్ట్ర భవిష్యత్తుకు దార్శనికుడు చంద్రబాబు. ఈ సారి జరగబోయేది యుద్ధమే. మనమంతా సైనికుల్లా పనిచేసి చంద్రబాబును గెలిపించాలి 'అని తెదేపా ప్రొఫెషనల్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు పొడపాటి తేజస్వి అన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులో నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఐటీ ప్రొఫెషనల్స్‌తో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అయిదు మండలాల నుంచి ఐటీ ఉద్యోగులు భారీగా హాజరై నియోజకవర్గ, పలు అంశాలపై చర్చించారు.

## గబ్బిలాల్లో మానవులకు సోకే మరో వైరస్ గుర్తింపు: ఎకోహెల్త్

జెనీవా: గబ్బిలాల నుంచి మానవులకు సోకే ప్రమాదం ఉన్న మరో కొత్త వైరస్‌ను థాయ్‌లాండ్‌లో గుర్తించినట్లు న్యూయార్క్ కేంద్రంగా పనిచేస్తున్న 'ఎకోహెల్త్ అలయన్స్' అనే పరిశోధనా సంస్థ తెలిపింది. దీన్ని ఇంతకు ముందెప్పుడూ చూడలేదని ఇటీవల జరిగిన 'ప్రపంచ ఆరోగ్య సంస్థ ' సమావేశంలో శాస్త్రవేత్త డాక్టర్ పీటర్ దస్జాక్ వెల్లడించారు. చైనాలోని వుహాన్ ల్యాబ్‌లో గతంలో పరిశోధనలు జరిపిన ఈ ఎకోహెల్త్‌పై గతంలో అనేక వివాదాలు చుట్టుముట్టాయి. ఈ ల్యాబ్ నుంచే కరోనావైరస్ లీకైందని వచ్చిన అనుమానాలనూ ఈ సంస్థ కొట్టిపారేసింది. కరోనా స్థాయిలో వ్యాపించే సామర్థ్యం తాజాగా గుర్తించిన కొత్త వైరస్‌కూ ఉందని పీటర్ తెలిపారు. థాయ్‌లాండ్‌లో ఓ గుహలోని గబ్బిలాల్లో దీన్ని గుర్తించినట్లు చెప్పారు. స్థానిక రైతులు ఈ గుహ నుంచి గబ్బిలాల ఎరువును పంట పొలాల్లో ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఎరువులోనే ఆ వైరస్ ఉన్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో మనుషులతో తరచూ కాంటాక్ట్‌లోకి వస్తున్న ఈ వైరస్ భవిష్యత్‌లో



అత్యవసర పరిస్థితులను తీసుకొచ్చే ప్రమాదం ఉందని తెలిపారు.

గత నెలలో ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు పెరిగిన విషయం తెలిసిందే. డిసెంబర్‌లో దాదాపు 10 వేల మరణాలు నమోదయ్యాయని %ఔ ఏూ% తెలిపింది. కొత్త ఉపవేరియంట్ %జీచీ%.1 వ్యాప్తితో పాటు సెలవుల నేపథ్యంలో ప్రజలు గుమిగూడటమే అందుకు కారణమని వివరించింది. ఈ నేపథ్యంలో సంస్థ నిర్వహించిన అత్యవసర సమావేశంలో పీటర్ కొత్త వైరస్ గురించి వెల్లడించారు.

## ఉసిరితో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు!

ఉసిరికాయ అనేది దక్షిణ ఆసియాలో ఉద్భవించిన ఒక ఆరోగ్యకరమైన పుష్పించే మొక్క. ఇది ఫిలాంథస్ కుటుంబానికి చెందినది. దీని శాస్త్రీయ నామం ఫిలాంథస్ ఎంబ్లికా. ఉసిరి చెట్టు సుమారు 8 నుండి 18 అడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది. దీని ఆకులు చిన్నవి ఆకుపచ్చగా ఉంటాయి. ఉసిరికాయలు గుండ్రంగా, పసుపు రంగులో ఉంటాయి.

ఉసిరికాయ భారతదేశంలో సాంప్రదాయ ఆయుర్వేద ఔషధంలో వేల సంవత్సరాలుగా ఉపయోగించబడుతోంది. ఇది విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు మరియు ఇతర పోషకాలు కలిగి ఉంటుంది. ఉసిరికాయను వంటల్లో కూడా వినియోగిస్తుంటాం. ఉసిరితో పచ్చడి కూడా చేస్తుంటారు. అన్నం ఉసిరి పచ్చడి కాంబినేషన్ యమ రుచిగా ఉంటుంది. ఉసిరికాయతో ఎన్నోఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

ఉసిరికాయ యొక్క కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఇక్కడ ఉన్నాయి:- రోగనిరోధక శక్తిని పెంచుతుంది: ఉసిరికాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది శరీరంలోని బ్యాక్టీరియా,వైరస్‌లతో పోరాడుతుంది.- జలుబు మరియు దగ్గు నుండి ఉపశమనం కలిగిస్తుంది: ఉసిరికాయ జలుబు మరియు దగ్గు యొక్క లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఉసిరికాయ పొడిని తేనెతో కలిపి తీసుకోవడం ద్వారా ఇది ఉత్తమంగా పనిచేస్తుంది.- మలబద్ధకాన్ని నివారిస్తుంది: ఉసిరికాయలోని ఫైబర్ మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది. ఉసిరికాయ పొడిని నీటితో కలిపి తీసుకోవడం ద్వారా ఇది ఉత్తమంగా పనిచేస్తుంది.- క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడుతుంది: ఉసిరికాయలోని యాంటీఆక్సిడెంట్లు క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.- చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి: ఉసిరికాయలు చర్మాన్ని ఆరోగ్యంగా మరియు చర్మంపై మచ్చలు నివారించడంలో సహాయ పడతాయి.- జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి: ఉసిరికాయలు మన కేశాలను ఆరోగ్యవంతంగా బలంగా ఉండటంలో సహకరిస్తాయి. అంతేకాదు తలలో చుండ్రును నివారించడంలో సహాయపడతాయి.- గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది: ఉసిరికాయలోని యాంటీఆక్సిడెంట్లు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

## అడవిలో హీరో నితిన్‌కు ప్రమాదం



తెలుగు చిత్ర పరిశ్రమలో సరైన హిట్ లేక ఇబ్బంది పడుతోన్న హీరోల్లో యూత్ స్టార్ నితిన్ ఒకడు. వెంకీ కుడుముల తెరకెక్కించిన 'భీష్మ'తో భారీ విజయాన్ని అందుకున్న తర్వాత ఈ టాలెంటెడ్ హీరో ఎన్నో ప్రయత్నాలు చేశాడు. కానీ, సక్సెస్‌ను మాత్రం సొంతం చేసుకోలేకపోయాడు. అయినప్పటికీ వరుసగా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తున్నాడు.

ఇటీవలే నితిన్ 'ఎక్స్‌ట్రా ఆర్డినరీమ్యాన్' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. కానీ, ఈ చిత్రం కూడా ప్రేక్షకుల మెప్పును పొందలేకపోయింది. ఫలితంగా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. ఇక, ఇప్పుడు నితిన్.. వేణు శ్రీరామ్ దర్శకత్వంలో 'తమ్ముడు' అనే సినిమాను చేస్తున్నాడు. పవన్ టైటిల్‌తో వస్తున్న ఈ సినిమాపై అంచనాలు భారీ స్థాయిలోనే ఏర్పడ్డాయి.

వేణు శ్రీరామ్ - నితిన్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'తమ్ముడు' మూవీకి సంబంధించిన షూటింగ్ కొద్ది రోజుల క్రితమే ప్రారంభం అయింది. అప్పటి నుంచి దీనికి ఏమాత్రం బ్రేకులు లేకుండా చిత్రీకరణ జరుపుతూనే ఉన్నారు. ఇందులో హీరో నితిన్‌తో పాటు చాలా మంది ప్రముఖులు భాగం అవుతున్నారు. త్వరలోనే దీన్ని పూర్తి చేసేలా ప్లాన్లు చేసుకుంటున్నారు.

'తమ్ముడు' మూవీకి సంబంధించిన షూటింగ్ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరుగుతోంది. అక్కడ హీరో నితిన్‌పై కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లను షూట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా అతడికి షూటింగ్‌లో ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ఓ భారీ యాక్షన్ సీన్ చేస్తోన్న సమయంలోనే నితిన్ గాయపడినట్లు తాజాగా తెలిసింది. గాయపడిన నితిన్‌ను ముందుగా రాజమండ్రిలోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. అక్కడ ప్రథమ చికిత్సను చేసిన తర్వాత హైదరాబాద్ తరలించారని అంటున్నారు. ఈ ఘటనలో హీరో నితిన్‌కు చాలా చోట్లా గాయాలు అయినట్లు సమాచారం. దీంతో వైద్యులు అతడికి మూడు వారాలు విశ్రాంతి సూచించినట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నితిన్ సన్నిహితులు చెప్తున్నారు.

నితిన్ - వేణు శ్రీరామ్ కాంబోలో వస్తున్న 'తమ్ముడు' మూవీని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఇందులో సప్తమీ గౌడ హీరోయిన్‌గా, వర్ష బొల్లమ్మ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇక, నితిన్‌కు గాయాలు కావడంతో ఈ సినిమా షూటింగ్‌కు బ్రేక్ పడిపోయింది.

## గర్భిణీ మహిళలు పైనాపిల్ తినొచ్చా..?

సాధారణంగా గర్భిణీ మహిళలు మంచి పోషకాహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. అంతేకాదు నిండు గర్భిణీలు వారి ఆహార పద్ధతులను కూడా చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. గర్భిణీ మహిళలు తమ ఆహారంలో పైనాపిల్ తీసుకోవచ్చా..? పైనాపిల్ ఏ రకంగా వారికి మేలు చేస్తుంది.. అనేది ఇప్పుడు చూద్దాం.గర్భిణీ మహిళలు పైనాపిల్‌ను ఆహారంగా తీసుకోవచ్చు. పైనాపిల్ ఒక రుచికరమైన మరియు పోషకమైన పండు, ఇది గర్భధారణ సమయంలో చాలా ప్రయోజనాలను అందిస్తుంది.

పైనాపిల్‌లో విటమిన్ సి అధికంగా ఉంటుంది, ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఇది ఫోలేట్‌కు కూడా మంచి మూలం, ఇది గర్భధారణ సమయంలో ముఖ్యమైన పోషకం. ఫోలేట్ శిశువు మెదడు మరియు వెన్నెముక అభివృద్ధిలో సహాయపడుతుంది.

పైనాపిల్‌లో బ్రోమెలైన్ అనే ఎంజైమ్ కూడా ఉంటుంది, ఇది శరీరంలోని పలు అవయవాల వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది గర్భధారణ సమయంలో సాధారణంగా కనిపించే మలబద్ధకం మరియు ఉబ్బసంల నుంచి ఉపశమనం కల్పించడంలో తోడ్పడుతుంది. అందుకే వైద్యులు పైనాపిల్ తీసుకోవాల్సిందిగా గర్భిణీ స్త్రీలకు సూచిస్తారు. అయితే కొందరు గర్భిణీ స్త్రీలు పైనాపిల్ తినడం వల్ల గర్భస్రావం జరుగుతుందని లేదా పిండం వృద్ధి చెందడంలో జాప్యం ఏర్పడుతుందని ఆందోళన చెందుతారు.

ఇందులో ఎంత మాత్రం నిజం లేదని నిపుణులు చెబుతున్నారు. దీనికి శాస్త్రీయమైన ఆధారాలు లేవని చెబుతున్నారు. అయితే గర్భస్రావం, పిండం వృద్ధి చెందకపోవడానికి పైనాపిల్ కారణం కాదని కొన్ని అధ్యయనాల ద్వారా తెలుస్తోంది. పైనాపిల్ తినాలనుకునే గర్భిణీ స్త్రీలు ఇంకా ఏమైనా అనుమానాలుంటే వైద్యుడిని సంప్రదించి వారి సలహా తీసుకుంటే మంచిది. మీ ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా సలహా ఇవ్వడం జరుగుతుంది.

గర్భిణీ మహిళలు పైనాపిల్ తినేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి:

**పైనాపిల్ పూర్తిగా పండిందని నిర్ధారించుకోవాలి**.

పండని పైనాపిల్‌లో బ్రోమెలైన్ స్థాయిలు ఎక్కువగా ఉంటాయి, ఇది గర్భస్రావం లేదా పిండం యొక్క వృద్ధిలో జాప్యానికి కారణం కావచ్చు.

పైనాపిల్‌ను చాలా ఎక్కువగా తీసుకోవద్దు.

గర్భధారణ సమయంలో, మీరు రోజుకు ఒక కప్పు పైనాపిల్‌కు మించి తినకూడదు.

పైనాపిల్‌ను తినే ముందు, దానిని శుభ్రం చేసి, గింజలను తీసివేయండి.

గర్భిణీ మహిళలు పైనాపిల్ తినడం వల్ల కలిగే ప్రయోజనాలు:

రోగనిరోధక శక్తిని పెంచుతుంది

ఫోలేట్‌కు మంచి మూలం

శరీరంలో వాపును తగ్గిస్తుంది

మలబద్ధకం మరియు ఉబ్బసం నుంచి రిలీఫ్ ఇస్తుంది.

# హైదరాబాద్-విజయవాడ హైవేలో ఇరుక్కుపోయారు



హైదరాబాద్ :సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నగరంలోని లక్షలాది మంది ప్రజలు సొంతూళ్ల బాట పట్టారు. దీంతో రహదారులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. గత రెండు, మూడు రోజుల నుంచి జాతీయ రహదారులన్నీ రద్దీగా దర్శనమిస్తున్నాయి. ఇక, శనివారం జాతీయ రహదారి 65 పై 5 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలతో ధర్మాజీ గూడెం స్టేజ్ వద్ద గందరగోళం ఏర్పడింది. విజయవాడ వెళ్లే వాహనాలను రెండు ప్రధాన రహదారులపైకి పంపించడంతో.. 5 కిలోమీటర్ల మేర వేలాది వాహనాలు నిలిచిపోయాయి.

శనివారం తెల్లవారుజాము నుంచి ట్రాఫిక్ నిలిచిపోవడం గమనార్హం. ఆదివారం నుంచే పండుగ మొదలు అవుతుండటంతో గత రెండు రోజుల కంటే రెండింతల వాహనాలు శనివారం రహదారులపైకి వచ్చాయి. దీంతో జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు హైవేపై 50 వేల ప్రైవేట్ వాహనాలు వెళ్లడం గమనార్హం. వీటిలో 90 శాతం కార్లే ఉన్నాయి.

ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించే పనిలో నిమగ్నమైనప్పటికీ వాహనాలు మాత్రం వేగంగా ముందుకు కదలని పరిస్థితి ఏర్పడింది. సూర్యాపేట దగ్గర ఉన్న టోల్ గేట్ దగ్గర మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. తెలంగాణతోపాటు ఏపీ జిల్లాలకు వెళ్లేందుకు ఇదే మార్గం కావడంతో వేలాది వాహనాలు రహదారిపై నిలిచిపోయాయి. భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో గంటలపాటు రహదారిపైనే వాహనాలు గడపాల్సి వచ్చింది. మరోవైపు, బస్టాండ్ లు, రైల్వే స్టేషన్లు కూడా ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడిపోయాయి

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి కే ప్రజల మద్దతు

భీమిలి: తెలుగుదేశం పార్టీ చేస్తున్న రా కదిలి... రా కార్యక్రమంలో ప్రజలు అమరావతి రాజధానికే మద్దతు పలుకుతున్నారని చంద్రబాబు బహిరంగ సభలో స్పష్టమైందని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తెలియజేశారు. మరో 90 రోజులలో రాష్ట్ర ప్రజల దశ - దిశ మారిపోతున్నాయని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. తెలుగుదేశం - జనసేన కూటమి అధికారంలోకి రావడం ద్వారా.. రాష్ట్రంతో పాటు రాష్ట్ర ప్రజలు కూడా అన్ని రంగాలలోనూ అభివృద్ధి చెందుతారన్నారు. భీమిలి లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు కలసి మందడం గ్రామంలో భోగి మంటలు వేశారన్నారు. ఇటు ప్రజలు కూడా తెలుగుదేశం జనసేన కూటమి విజయాన్ని సంపూర్ణంగా స్వాగతిస్తున్నారు అన్నారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలు అని ప్రగల్భాలు పలికే వైయస్ జగన్మోహన్ రెడ్డి.. వాస్తవానికి అన్ని వర్గాల వారిని మోసం చేసారన్నారు. అంగన్వాడీ లతోపాటు మహిళలు, యువత, మైనారిటీలు ఇలా అన్ని వర్గాల వారు వైయస్ జగన్ పరిపాలనలో తీవ్రంగా మోసపోయారన్నారు. ఈ పరిస్థితులలో జగన్మోహన్ రెడ్డికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇదే క్రమంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి సాగిస్తున్న దుష్ట పాలనపై ఇప్పటివరకు 7 ఆడియో సిడిలను విడుదల చేసామని.. ఎనిమిదవ ఆడియో సిడిని దివంగత ఎన్టీఆర్ వర్ధంతి రోజున జనవరి 18న " ఎదురులేని మనిషి " ఆడియో సిడి విడుదల చేస్తున్నామని చెప్పారు.



# దూ దూ..... దూ దూ..... బసవన్న...!!



గంగిరెద్దులనాడించే సంప్రదాయం ఆంధ్రదేశంలో అన్ని ప్రాంతాల్లోను ప్రచురంగా ఉంది. ఈ గంగిరెద్దుల ప్రస్తావన 'గజాసుర సంహార' కథలో కూడ చెప్పబడింది. పూర్వం గజాసురుడు అనే రాక్షసుడు శివుణ్ణి గురించి ఘోరమైన తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమనగా నీవు ఎల్లవేళలందు నాతోనే ఉండాలని కోరాడు. భోళాశంకరుడు సరేనని అతనిగర్భంలో ప్రవేశించి, యోగనిద్రాముద్రితుడై హాయిగా ఉన్నాడు. పార్వతీదేవి భర్త కన్పించకుంటే ప్రమథగణాలచేత పద్నాలుగు లోకాలలోను గాలింపజేసింది. అయినా భర్త కానరాక విష్ణుమూర్తిని శరణుకోరింది.

మహేశ్వరుడు ఆత్మలింగమై గజాసురునిగర్భంలో స్థిరనివాస మేర్పరుచెకొని ఉన్న సంగతి విష్ణువు తెలుసుకొని శివుణ్ణి గజాసురగర్భం నుంచి బయటకు తేవడానికి గంగిరెద్దుమమేళమే సరైన ఉపాయమని విశ్చయించాడు. తలచిందే తడవుగా శ్రీహరి నందీశ్వరుణ్ణి రప్పించి గంగిరెద్దుగా అలంకరింపజేసాడు. బ్రహ్మాదిదేవతలందరు తలొక వాద్యం చేతబూనగా తాను సన్నాయి, చిరుగంటలు ధరించి, గంగిరెద్దు మేళంతో గజాసురుని సభలోనికి పోయి గంగిరెద్దును ఆడించాడు. జగన్నాటక సూత్రధారియైన శ్రీహరి గంగిరెద్దును చిత్రవిచిత్రగతులతో మనోమోహనంగా ఆడించగా గజాసురుడు ముగ్ధుడై వరం కోరుకోమన్నాడు. శ్రీమహావిష్ణువు అతనిగర్భంలో ఉన్న ఆత్తలింగం కావాలన్నాడు. అమాటలు వినగానే గజాసురునికి గంగిరెద్దువానిగా వచ్చిన మహనీయడెవరో అర్థమైపోయింది.

అతడు శ్రీహరికి నమస్కరించి "మహానుభావా! సాక్షాత్తు శ్రీమన్నారాయణునిచే గంగిరెద్దు మేళం చేయించుకొనే అదృష్టం నాకుదక్కింది. దానివల్ల నా జన్మ చరితార్థమైపోయింది. ఆత్మలింగాన్ని నీవే నా గర్భంనుంచి తీసుకో" అని అనేకవిధాల స్తుతించాడు. శ్రీహరి ప్రభోధించగా నందీశ్వరుడు గజాసురుని గర్భాన్ని చీల్చి శివుణ్ణి బయటకు రప్పించాడు. ఈ విధంగా గంగిరెద్దుమేళం ఆనాడే నిర్వహించారు.

పూర్వకాలంలో గంగిరెద్దులనాడించేవారు దాన్నే వృత్తిగా చేపట్టేవారు. గ్రామాలలో ఏ శుభకార్యం జరిగినా అది చిన్నదైనా పెద్దదైనా గంగిరెద్దుమేళానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చేవారు. తాము ఏపనిని ప్రారంభించినా ముందుగా గంగిరెద్దుమేళం చేయిస్తే శుభప్రదమని ప్రజల నమ్మకం. ఏ పూజచేసినా ముందుగా గణపతిని పూజించినట్లే ఏ కార్యక్రమానికైనా ముందుగా గంగిరెద్దును మేళతాళాలతో లోనికి ప్రవేశింపజేసి కార్యక్రమం ప్రారంభిస్తే మంచి జరుగుతుందని ఆ విధంగా చేస్తారు. గంగిరెద్దు ప్రవేశించిన తరువాతే విఘ్నేశ్వరపూజ తక్కిన కార్యక్రమాలు. ఒక విధంగా చూస్తే వినాయకుని ఆవిర్భావానికి హేతుభూతమైంది ఈ గంగిరెద్దుమేళం. అందుచేతనే దీనికి ప్రప్రథమస్థానం ఈయడం జరిగి ఉండవచ్చు.

గంగిరెద్దులవారు పురాణగాథలను గురించి మంచి అవగాహన కలిగి ఉంటారు. సాక్షాత్తు ఆ శేషశయనుడే తమ రూపుదాల్చడంవల్ల తమవృత్తికి గైరవం. ప్రాధాన్యం ద్విగుణీకృతమైనాయని వీరు భావిస్తారు. సంభాషించేటప్పుడు నిర్దుష్టంగా మాట్లాడాలనే తపనతో బాగా వత్తిపలుకుతారు. ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా తప్పకుండా తమ మేళం ఉండడంవల్ల వీరి భుక్తికి లోటు ఉండేది కాదు. మేళం చేయించుకున్న వారు వీరికి ధాన్యం, బట్టలు, డబ్బు మెదలైనవి ఇచ్చి తృప్తులను చేసేవారు. కాలక్రమాన సంప్రదాయాలకు కాలం చెల్లిపోవడంవల్ల వీరు భుక్తికై వేరు వేరు వృత్తులను చేపట్టాల్సిన అవసరం ఏర్పడింది. వీరిలో చాలా మంది విద్యాధికులై పెద్దపెద్ద ఉద్యోగాలు చేస్తున్నా పెద్దవారు తమ సంప్రదాయాన్ని విడువకుండా కాపాడుకుంటూ దాన్ని ముందు తరాలవారికి కూడా నేర్పుతూ ఈకళ పూర్తిగా సమసిపోకుండా సంరక్షిస్తున్నారు.

సంక్రాంతి వచ్చిందంటే తెల్లవారక ముందే దట్టమైన పొగమంచులో తమ సన్నాయిరాగాలతో పల్లెప్రజలను మేలు కొలిపి వారిచ్చింది తీసుకుని వెళ్లడం వీరి సంప్రదాయం. వీరికి దానంచేస్తే పుణ్యమని భావించి గ్రామీణులు చేటలకొద్దీ బియ్యం వీరి సంచులలో పోసేవారు. ఈ గంగిరెద్దుల వారు తాము తమ భుక్తికి ఆధారభూతమైన బసవన్నను పస్తులుంచరు. బసవన్నకుపెట్టాకనే వీరు తింటారు. వీరు ఆడించే ఆటలలో గంగిరెద్దుచేత కుస్తీ బస్వరాజు నాట్యం (ఎద్దు నాలుగుకాళ్లను ఆట ఆడించేవానిపై ఉంచి నిలవడం), మెడ కాయ గాయబు, కబడ్డీ, బతకమ్మ, అయ్యవారికి దండంపెట్టు ఆటలు ఆడిస్తారు.

**ఆహార్యం:** గంగిరెద్దులనాడించేవారు పింజపోసి పంచకట్టుకుంటారు. పైన చొక్కాదాని మీదకోటు తొడుగుతారు. తలకు పాగా చుడతారు. ఈ పాగా వెనుకవైపు మూరెడు పొడవున తోకలా వ్రేలాడుతూ ఉంటుంది. వీరికి ముక్కుకాడ తప్పనిసరిగా ఉండాలి. చెవులకు పోగులు ముక్కుకాడమాత్రం బంగారంతోనే చేయించుకుంటారు. మెడలో వెండికంటె, చేతులకు వెండిమురుగులు, కాళ్లకు వెండి కడియాలు ధరిస్తారు. నుదుట తిరుచూర్ణంతో నామం ధరిస్తారు. చేతిలో స్తాయి. చిటితాళం, డోలు ఒక్కొక్కరు ఒక వాద్యం తీసుకుంటారు. ఒక్కరే ఇంటే సన్నాయి చేతబట్టి చిటితాళాలను మెడలో వ్రేలడదీసుకుంటారు. ఇద్దరు ఉంటే ఒకరు డోలు, ఒకరు సన్నాయి, చిటితాళం ధరిస్తారు. వీరు బాలురకు కూడా బాల్యం నుండే ఈ విద్య నేర్పి తమ వెంట తిప్పుకుంటారు.

గంగిరెద్దు అలంకరణ: గంగిరెద్దును వీరు సాక్షాత్తు కైలాసంలోని నందిగానే భావిస్తారు. తమకు భుక్తిని ప్రసాదించే ఈ బసవన్న అంటే వీరికి భయం, భక్తి, గౌరవం. తాము తిన్నా తినకపోయినా వీరు ఈ వృషభానికి మంచి పౌష్టికాహారం తినిపిస్తారు.ప్రతిరోజు శ్రద్ధగా వీటికి స్నానం చేయించి, అలంకరించి పూజిస్తారు. గంగిరెద్దుమేళం చేసేటప్పుడు ముందుగా బసవన్నకు స్నాం చేయించి, ముఖానికి పసుపుపూసి నిలువుగా కుంకుమబొట్టు పెడతారు. బసవన్నకొమ్ములకు చిరుగంటలుకడతారు. మెడలో ఒక గంట వ్రేలాడదీస్తారు. కాళ్లకు చిరుగజ్జెలుకట్టి దిష్టితగలకుండా వెనుక కాళ్లకు ఎడమకాలికి జుట్టుతో పేనిని త్రాడుకడతారు.

మెడలో పూసలదండలు, బంతి పూలమాలలు వేస్తారు. రెండుకొమ్ములను కలుపుతూ రంగురంగుల పూసలదండలు అలంకరిస్తారు. కొమ్ముల చివర ఇత్తడి తొడుగులు అలంకరిస్తారు. మూపుపై బొంతలు వేసి, ఆపైన మంచిమంచిరంగులు, పూలు ఉన్న చీరలుగాని, దుప్పట్లుగాని వేస్తారు. మూపురం చుట్టూ పూలదండలు, పూసలపేర్లు చుడతారు, ప్లాస్టిక్‌యుగంగా మారిన ఈ రోజులలో గంగిరెద్దులకు ప్లాస్టికక్‌పూలు, కాగితంపూలు కూడా అలంకరిస్తున్నారు.

ప్రదర్శన: వీరు గంగిరెద్దును తీసుకొనివచ్చి ముంగిటనిలిపి ముందుగా డోలు, సన్నాయి వాయిస్తారు. ఇంటిలోని వారు బయటకు వచ్చాక -

"డూడూడూడూ బసవన్న, దొడ్డదొరండీ బసవన్న, అయ్యగారికి దండ్డంపెట్టు, అమ్మగారికి దండంపెట్టు, బాబుగారికి దండంపెట్టు, బాలదొరలకు దండంపెట్టు, కోటిలాభములు కలగాలండీ, కోటివేల్పుల దయకలగాలండీ, డూడూ డూడూ బసవన్న, తిరుపతికొండకు ప్రయాణమండీ, దేవునిమ్రొక్కులు తీర్చాలండీ, బంగరుగిట్టల బసవన్నండీ, పయిడికొమ్ముల బసవన్నండీ, బాలమెరుంగుల బసవన్నండీ, భాగ్యములిచ్చే బసవన్నండీ, వెండికొండపైవిహారమండీ, విశ్వనాథుని వాహనమండీ, పప్పుబియ్యం పట్టుకురండీ, బసవన్నదయ సంపాదించండి, డూడూడూడూ బసవన్న" అంటూ పాట పాడుతారు. డూడూడూడూ బసవన్న అని అన్నప్పుడల్లా గంగిరెద్దు తల ఊపుతూ ఉంటుంది. ఇలా ఊపినప్పుడు కొమ్ములకున్న చిరుగంటలు, మెడలోని గంట జేసే ధ్వనులు మనోరంజకంగా ఉంటాయి. "బసవన్న అమ్మగారికి దండంబెట్టు" అంటే గంగిరెద్దు ముందుకాలు పైకెత్తి నమస్కరిస్తుంది. అయ్యగారింటబాజాలెప్పుడు మ్రోగుతాయి చెప్పు బసవన్నా చెప్పు అంటూ దాని మూతి దగ్గర చెవి పెట్టి ఓహో! త్వరలోనే పెళ్లిజాజాలు ప్రమోగుతాయంట- మా బసవన్న మాటకు తిరుగులేదు ఏమంటావు? బసవన్న! అనగానే గంగిరెద్దు ఔనన్నట్లు తకవూపుతుంది. ఇదే విధంగా ఆ ఇంటివారివిషయాలు ముందేతెలుసుకొని దాని కనుగుణంగా బసవన్నని ప్రశ్నిస్తూ అన్నీ శుభాలే జరుగుతాయని ఇంటివారికి జోస్యంచెప్పి ఆనందింపజేస్తారు. బసవన్నను ముందుకాళ్లమీద కూర్చోపెట్టి, నృత్యం చేయించి, వివిధభంగిమలలో తల ఊపించి చిత్రవిచిత్రంగా గంగిరెద్దుని ఆడిస్తారు. బసవన్న చెవులు ఊపే తీరుచూస్తే ముచ్చటగొలుపుతుంది. అవ్యహృదయమర్మజ్ఞులలాగానే వీరు వెనుక గిల్లడం, తోకను స్పృశించడం ద్వారా వీరు బసవనికి ఆదేశాలు జారీ చేస్తారు.

డూడూడూడూ బసవన్నా/అయ్యగారికి సలాము చేయి, అమ్మగారికి దణ్ణంబెట్టు/పిల్లలతో తలలూపి, పిలిచి నవ్వించూ/ పట్టుబట్టకు చేయి చాపించూ, పండగ ఈనాములడిగి పుచ్చుకో ॥

ఈవిధంగా వీరు గంగిరెద్దును చిత్రవిచిత్రగతులతో ఆడించి, దండాలు పెట్టించి, గృహస్థులను ఆనందపరచి, వారి నుంచి కానుకలందుకొంటారు. వీరికి ధాన్యం, బట్టలు తప్పక ఇస్తారు. బట్టలు అంటే పాతబట్టలే. చీరలు, దుప్పట్లు, బొంతలు, కోటులు, చొక్కాలులాంటివి ఏవైనా తమకు తోచినవి వీరు ఈయగానే వాటిని గంగిరెద్దుమూపుపై వేసి అవన్నీ బసవన్నకే అర్పితం అంటారు. కానీ వాటిని ధరించేది గంగిరెద్దులవారు. వారి కుటుంబసభ్యులే. వీరు యాచించేటప్పుడు కూడా బసవన్నకి అర్చించుకోండి అనే అడుగుతారు.

"ప్రభువుగారికి దణ్ణం బెట్టూ / పాదంవంచి భక్తినిపెట్టూ
పట్టుశాలువలు కప్పెదరంటా / కాసులుమువ్వలు కట్టెదరంటా
డూడూడూడూ యెంకన్నా / యేడుకొండల యీశ్వరుడండీ
యెండి కొండలా యెంకన్నండీ / కాసులుమువ్వలా బసవయ్యండీ

ఈవిధంగా గంగిరెద్దు నాడించే తీరుకు తమ వాక్చాతుర్యాన్ని కూడా జోడించి, చూపరులహృదయాలను రంజింపజేసి కానుకలందుకుంటారు. గంగిరెద్దు ధర్మానికి సంకేతం అని, దాని మూపురం శివలింగమని, ఇది నంది వాహనంమీద శివుడు వచ్చాడనేందుకు సంకేతం అని కొందరి విశ్వాసం. గంగిరెద్దువచ్చి ఇంటి ముంగిట ముగ్గులో నిలుచుంటుంది. అప్పుడు ఆ బసవడు ముగ్గులోని గొబ్బెమ్మను తొక్కితే శుభం చేకూరుతుందని జానపదులనమ్మకం. ఆ గొబ్బెమ్మ గోవుకు సంకేతం,దానిపై నిలచిన వృషభం నేలనుండి ఉద్భవించిన పంటకు సంకేతం. ఈ ధర్మవృషభానికి ముందువెనుకనున్న గంగిరెద్దులవారు శంకరపరివారమైన భృంగి-భృంగిరిటులకు ప్రతీకలు. సంవత్సరంపాటు శ్రమించగా వచ్చిన ధాన్యాన్ని మన ఇంటికి చేర్చినందుకు మనం ఆనందంతో కప్పే వస్త్రం మన శరీరానికి సంకేతం. "లయకర్త అయిన శంకరా! ఈ శరీరాన్ని నీకు ఇచ్చేస్తూన్నాను, పైజన్మకైనా ఉత్తమమైన శరీరాన్నియ్యి లేదా జన్మరాహిత్యాన్ని ప్రసాదించు!" దఅని ప్రార్థించడమే ఇందులోని అంతరార్థం.

# సంక్రాంతి పండుగ విశిష్టత



సంవత్సరంలో పెద్ద పండుగ-అంటే- నెలరోజుల పాటు సాగేపండుగ సంక్రాంతి పండుగే! 'పెద్ద పండుగను ఆనందంగానే గడుపు కోవడానికి సిద్ధమయ్యాం. ఈ సందర్భంగా పండుగలో వచ్చే సంక్రాంతి ముగ్గులూ- గొబ్బెమ్మలూ- గొబ్బి పాటలూ-గంగిరెద్దు రాకలూ- హరిదాసు కీర్తనలూ... ఒకటేమిటి! ఇలా అన్నింటిలోని విశేషాలను గమనించు కుంటూ పోదాం.మేషం.. వృషభం.. మిధునం..ఇలా పన్నెండు రాసుల పేర్లను మనం వింటూంటాం.సూర్యుడు ఈరాశుల పన్నెండింటిలోనూ నెలకు ఒక్కొక్కరాశిలో చొప్పున నివసిస్తూ,మరో రాశిలోనికి నెల కాగానే సంక్రమణం (జరగడం) చేస్తాడు. మేషంలోకి రాగానే మేష సంక్రాంతీ, వృషభంలోకి రాగానే వృషభ సంక్రాంతి....అలా అవుతూ ఉంటుంది. ఇప్పుడు మకరరాశిలోనికి వచ్చిన కారణంగా దీన్ని రవి 'మకర సంక్రాంతి'విశేషం ఉంది కాబట్టి,ఈ సంక్రాంతిని మాత్రమే పండుగగా నిర్ణయించారు.ఈ పై విషయాన్నే జ్యోతిషశాస్త్రం ఇలా చెప్పింది

**మేషాదిషు క్రమేణ సంచరత స్సూర్యస్య**
**పూర్వస్మా దుత్తరరాశౌ సంక్రమణ ప్రవేశ స్సంక్రాంతిః -**

చిత్రమైన అంశ మేమంటే మనది చాంద్రమానం.అంటే చంద్రుని ద్వారా కాలాన్ని కొలిచే విధానం అంటే చంద్రుడు పూర్తిగా కన్పడని అమావాస్యతో నెల ముగిసినట్టూ, అమరునాటి నుంచి కొత్త నెల ప్రారంభమైనట్లూ లెక్కించుకునే విధానం. ఐతే మనం ఇప్పుడు సూర్యుని సంచారాన్ని బట్టి అంటే సౌరమానం ప్రకారం కాలాన్ని కొలవడం దక్షిణ ప్రాంత ప్రజలలో ఎప్పుడూ సంప్రదాయంగా ఉంటూనే ఉంది.దక్షిణ ప్రాంత ప్రజల సౌరమానం మాన చంద్రమానం అనే ఈ రెండూ,సంవత్సరానికి రెండుసార్లు కలుస్తాయి.వాటినే దక్షిణా యనం- ఉత్తరాయ ణం రోజులుగా (జూలై పదహారు-జనవరి పధ్నాలుగు) నిర్ణయించారు. సంవత్సరంలో ఈ రెండు రోజుల్లో మాత్రమే రాత్రింబవళ్లకాలం సమానంగా ఉంటుంది.ధనుర్మాస ప్రారంభం నుంచి సూర్యకాంతి దిశమారుతూ మారుతూ సంక్రాంతి నాటికి సంపూర్ణంగా మారుతుంది. ఈ నెలకాలాన్ని 'నెల పట్టారు' అని అంటారు.

**మూడు రోజుల ముచ్చటైన పండుగ**

సత్వర జస్తమా లనే త్రి గుణాలూ-సృష్టి, స్థితిలయిలు-త్రిమూర్తులూ భూతభవిష్యద్ వర్తమానాలనే త్రికాలాలూ-ఆయుర్వేదానికి వస్తే వాతపిత్తశ్లేష్మాలు... ఇలా భారతీయ సంప్రదాయంలో మూడు అనే అంకెకు ఓ ప్రత్యేకత ఉంది.ఈ పండుగలో కూడా భోగి-సంక్రాంతి-కనుము అనే పండగలు మూడు ఉన్నాయి.విశేషమేమంటే మూడు రోజుల పాటు వచ్చే ఈ పండుగలో ఆధ్యాత్మిక- లౌకిక-వైద్యశాస్త్ర -విశేషా లనే మూడు ప్రయోజనాలూ ఉండడమే!

**ముగ్గులో 1) ఆధ్యాత్మిక విశేషం**

మూడు చుక్కలు అడ్డంగానూ-మూడు చుక్కలునిలువుగానూ పెట్టి -రమ్యంగా వేసే మూడు చుక్కల ముగ్గు ప్రతి ఆడపిల్లా ముందుగా నేర్చుకునే ముగ్గు.ఇది వట్టి ముగ్గు మాత్రం కానేకాదు.ఈ 9చుక్కలూవాటివల్ల ఏర్పడిన 9గడులూ నవగ్రహాలకు సంకేతం. 'గ్రహతీతి గ్రహః' ఏది తిరుగుతుందో దాన్ని గ్రహం అంటారట! దేవాలయానికి వెళ్లినప్పుడు మనం దైవం చుట్టూ ముమ్మారు తిరగడానికి- మనచుట్టూ మనమే తిరుగుతూ ఆత్మ ప్రదక్షిణ నమస్కారాలను దైవానికి సమర్పిస్తూండడానికీ కారణం-ఆ ఖగోళంలో తిరిగే గ్రహాలప్రభావం భూగోళంలో తిరిగే గ్రహలమైన మా మీద ఉంటుందని మేం గ్రహించామని చెప్పడానికే! అలాగే ఎవరికి వాళ్లు గుర్తించుకోవడానికే!

**లౌకిక విశేషం**

ముగ్గు పెట్టేటప్పుడు గీతను ఎంత సన్నగా గీస్తూ,ఎంత తక్కువ కాలంలో,ఎంత రమణీయంగా ఏ బాలిక పెట్టిందో గమనించి,ఆ ముగ్గును వాడిన విధానాన్ని బట్టి,ఆ బాలిక పొదుపరితనమూ-ముగ్గు అందాన్ని బట్టి ఆ బాలికకుఉన్న అలంకరణ ప్రియత్వమూ- తొందరగానూ,తప్పులేకుండానూ వేయడాన్ని బట్టి ఆ బాలికకున్న ఏకాగ్రతా,మనకు అర్థం అవుతాయి. వ్యక్తికున్న క్రమశిక్షణ-శ్రద్ధఅనేవి పనులన్నింటి లోనూ కన్పిస్తాయి గదా!

**3.వైద్యవిజ్ఞాన విశేషం**

చలి కొరికే హేమంతుఋతువులో తెల్లవారుజామునే లేపడం,ముగ్గు పేరిట నడుమును వంచి అటూ,ఇటూ తిరగుతూ కిందికి బాగా వంగినప్పుడల్లా శ్వాసను నిదానంగా పీలుస్తూ ఉండటం వల్ల ఒక తీరు వ్యాయామం- ప్రాణాయామం జరుగుతాయి. ఇలా నెలరోజుల పాటు చేయడం వల్ల తెల్లవారుజామున లేపడం ఓ అలవాటుగా మారిపోతుంది. ఈవ్యాయామం వల్ల నడుము కొలత పెరగడం -వంటివి ఉండనే ఉండవు.ఇక ముగ్గులో వున్న సున్నపు ఘాటుకు ఇతర క్రిములు చనిపోతాయి.అంటే ముగ్గులు పెట్టడం ఒక విధంగా హానికర క్రిముల్ని ఆకర్షించి చంపించడాని కన్న మాటే కదా!

**గొబ్బెమ్మల్లో 1. ఆధ్యాత్మిక విశేషం**

ముగ్గుల్లో విశేషాలను పైన చూచాం కదా!ఆ ముగ్గుల మీద గొబ్బెమ్మలు కన్పిస్తాయి.ఆవు పేడతో ముద్దల్ని చేసి,మధ్యలో గురుగు చేసి,వాటి మధ్య,ఈ హేమంత కాలంలో పూచే బంతి, చామంతి రేకులను గుచ్చి పసుపు, కుంకుమలను అద్ది, గొబ్బెమ్మలను చేస్తారు. ఇంతేకాదు,వాటి చుట్టు తిరుగుతూ పాటలు పాడి,చివరికి నైవేద్యాలు కూడా పెడతారు.

పేడ ముద్దలకు నైవేద్యాలా? అనిపిస్తుంది- పైపైన చూస్తే. వరుసగా విశేషాలను చూద్దాం! పూర్వ ఫల్గునీ (పుబ్బ) నక్షత్రంలో 'కర్కాటక లగ్నంలో' తులసీ వనంలో గోదాదేవి పుట్టింది.ఈ గోదాదేవి గోపికలతో కలిసి,ఆ కృష్ణుని అతిభక్తితో సేవించింది.ఈ కన్పించే గొబ్బెమ్మలు పేడముద్దలు కాదు- గోపికలన్నమాట.ఆ గోపికలే గోపిబొమ్మలు.అవే కాలక్రామంలో గొబ్బెమ్మలుగా పిలవబడుతు న్నాయి. సంస్కతంలో 'గోపి'పదానికి తద్భవం 'గొబ్బి' అనేది. గొబ్బి+బొమ్మ=గొబ్బెమ్మ. గోపిక లందరిచేతా ఆరాధించబడే'గోదాదేవి 'అన్న మాట గొబ్బెమ్మ లుగా పైకి కన్పించే వీళ్లంతా కృష్ణభక్తురాండ్రు కూడా! ఈ విధంగా మనస్సులో భావించాలి. కాబట్టి వీటిచుట్టూ తిరుగుతూండే బాలిక లందరూ తమను తాము గోపికలుగా భావిం చుకుని, కృష్ణుని సేవించి తరించిన గోపికలుగా ఊహించుకోవాలి. వాళ్లంతా ఆ గోదాదేవి మార్గదర్శకురాలిగా భావించి, భగవదా





రాధన పారాయణ తను పొందాలని దీని భావమన్న మాట. ప్రదక్షణాలూ,నైవేద్యాలూ ఉండడానికి కారణం ఆ గొబ్బెమ్మల్లో కృష్ణభక్తురాండ్రును దర్శిస్తూండడమే- దర్శించాలని చెప్పడమే! కృష్ణభక్తురాండ్రైనవీళ్లు కృష్ణుని చుట్టూ కాకుండా, గోదాదేవి చుట్టూ తిరగడం దేనికి? అన్పించవచ్చు,'అహం స్మరామిమద్భక్తమ్'నేను నాభక్తుణ్ణి గూర్చి తలుస్తూ ఉంటా నని కదా పరమాత్మ మాట!దీన్ని బట్టి భగవంతుని కంటేఉత్తమ భగవంతుణ్ణి (భగవద్భక్తికలవాణ్ణి) సేవించడం ఉత్తమ మనే విషయాన్ని, గోదాదేవికి చేసే ప్రదక్షిణల ద్వారా చెప్పదలిచా రనీ-ఆ విష యాన్నే ప్రచారం చేయదలిచారనీ- గ్రహించాలన్న మాట.

**2.లౌకికవిశేషం**

చుట్టూ ఉన్నఇళ్లలోని ఆడపిల్లలంతా ఒక ఇంటికి చేరడం,ఆటపాటలతో -వాటిలో కూడ -పవిత్రమైనభావంతో గడపడం వల్ల ఒక విధమైన సాన్నిహిత్యం వాళ్లలో కల్గుతుంది. అంతేకాక ఎవరిలో పాడగలశక్తి ఉందో,ఎవరిలో నృత్యం చేసే నేర్పరితనం ఉందో,ఎవరిలో ఏ చక్కనిగుణం ఉండడం వల్ల ఆకర్షింపబడు తున్నారో తెలుస్తుంది-'మనము అలాఏదో ఒక నేర్పరితనాన్ని సాధించా'లనే పట్టుదల ప్రతి బాలికకు కల్గుతుంది.అన్నింటీని మించి 'నలుగురిలో ఉన్నప్పుడు ఎలా ఉండాలో ఎవరికి వారికి మరింతగా అర్థ'మౌతుంది.

**3.వైద్యవిజ్ఞానవిశేషం**

ఆవు పంచితం-ఆవుపేడ -ఆవు నెయ్యి- ఆవు- పెరుగూ- ఆవు పాలూ ఇవన్నీ ఔషధంలోనికి వాడబడే వస్తువులే!ఈ ఐదింటిలో మొదటి రెంటినీ యజ్ఞశాలను అలికేందుకూ,ఆ చివరి మూటీకి మరి రెండు (పంచదార- తేనె) వస్తువుల్ని చేర్చి,పంచమృతాలుగా చేసి,దేవునికి అభిషేకం చేసేందుకూ -అర్హమైన ద్రవ్యాలుగా ప్రాచీనులు ఏర్పాటు చేశారు.ఈ అభిషేకపు నీటిని 'తీర్థం'అనే పేరిట పిలుస్తూ,త్రాగవలసిన పవిత్రద్రవ్యంగా ఏర్పాటు చేశారు-పెద్దలు. తడిగా ఉన్న ఆవుపేడముద్ద నుంచి పురుగులు పుట్టకుండా ముగ్గుపై గొబ్బెమ్మని పెడతారు కదా! దీన్ని బట్టి ఒక వస్తువు చెడిపోకుండా ఏ విరుగుడు పదార్థన్ని దాని రక్షణ కోసం వాడాలోవాడచ్చో గమనించే విధానం ప్రతిబాలికకీ తెలుస్తుంది.

**గంగిరెద్దు...లో విశేషం**

ముందు ఒక్కరూ,వెనుక ఒకరూ వస్తూంటే,ఒంటి పై పాతదుప్పట్లతో,బొంతలతో వింత వింతఅలంకారాలతో గంగిరెద్దు ఇంటి ముందు నిలబడుతుంది.ఆ ఇద్దరూ శ్రు తిబద్ధంగా బాకా ఊదుతూ 'అయ్యవారికీ దణ్ణం పెట్టూ-అమ్మవారికి జేజే చెప్పు'అంటే తలడిస్తూ ముందు కాళ్లతో నృత్యం చేస్తూ ,వింత సంతోషాన్ని కలుగ చేస్తుంది-గంగిరెద్దు.

గంగ+ ఇర+ఎద్దు=గంగిరెద్దు, గంగమ్మకు 'ఇర' అంటే వాహనమైన 'ఎద్దు'ట ఇది.గంగమ్మ శంకరునివెత్తిపై ఉంటుంది కాబట్టి, ఈ ఎద్దు సాక్షాత్తూ శంకరు డన్న మాట.పార్వతీ పర మేశ్వరుల వాహనం ఎద్దు.ఒకప్పుడు ఇంద్రుడు ఈ ఎద్దు మూపురంలో దాక్కుని, రాక్షసింహరం చేసాడు.(మహేంద్ర మాస్థాయ మహో క్షరూపమ్..) పైగా ఎద్దు మూపురం శివ లింగాకారంగా ఉంటుంది కూడా !అందుకని - ఆ వచ్చిన ఎద్దులో సాక్షాత్తు శంకరు డున్నా డని భావించాలి.ముందు వెనుకా వచ్చిన వాళ్లను 'ప్రమథగణాలు' అనుకోవాలి. ఎద్దు చేసిన సహాయానికి సంతోషపడి దానికి మన బహుమానంగా, సంవత్సలపాటు వాడి, ఇక పనిచెయ్యవనుకున్న పాత దుప్పట్లు, బొంతలు ఇస్తే, తనకు శాలువాలు కప్పినట్లుగా ఆనందపడి వెళ్ళే విధానం దీనిలో కనిపిస్తుంది. ఇంట్లో పాతబడ్డ వస్త్రాలను అమ్మడం సరికాదని, ఇలా దానం చేయాలని, ఇంట్లో పాత వాటిని నిల్వఉంచుకోకుండా ఇంటిని పరిశుభ్రం చేసుకోవాలని ఈ విషయం తెలియజేస్తుంది. ప్రతీ సంక్రాంతికి ఇంట్లో పాత బట్టలు ఇలా వినియోగపడితే - వాటి స్థానంలో మనింటికి వచ్చిన దాన్యం ద్వారా కొత్త బట్టలు కొనుకుంటే, అది ఎంత చక్కని ఆలోచన ఉన్న విధానమే కదా.!! ఇంటి ముందకు ఎద్దు వచ్చింది. ముగింట్లో గోమయం, గొబ్బెమ్మల రూపంలో ఉంది.

**ఏకైకా గౌః- త్రయ స్సింహాః- పంచ వ్యాఘ్రాః ప్రసూతిభిః । అధర్మో నష్టసంతానః, ధర్మ స్సంతానవర్ధనః॥**

అని చారుచర్యలో క్షేమేంద్రు డంటాడు,ఒక ఈతలో ఆవు ఒకే ఒక పిల్లనీ,సింహం మూడినీ,పులి ఐదింటినీ కంటాయట!ఈ లెక్క ప్రకారం చూస్తే,లోకంలో ఆవుల సంఖ్య కంటే మూడు రెట్లు సింహాలూ,ఐదురెట్లు పులులూ ఉండాలి.కాని ఆవులే ఎక్కవ సంఖ్యలో ఉన్నాయి- ఉంటాయి కుడా! గోవుల సంతానం ధర్మమయ మైనదట! అధర్మ మయమై, హింసాస్వభావ మున్న పామూ, పులీ-సింహాల సంతానాన్ని,తల్లులైన ఆ పామూ-పులీ-సింహాలే, తాము కన్న కాసేపటిలో ఆకలి బాధకు తాళలేక చంపేస్తాయట.కాబట్టి ఇంటి ముందు ఆవు- ఎద్దులు ఉండడం మన కుడా ధర్మమయమైన సంతానం కలగా లనే ఆ కాంక్ష కల్గించేం దుకన్న మాట.సంస్కృతంలో 'గౌః' అనే పదానికి పురుషలింగమైతే ఎద్దనీ,స్త్రీ లింగమైయితే ఆవునీ అర్థం.పాడికి ఆవు సంకేతమైతే-పంటకు ఎద్దు సంకేతం,అంతే కాక,జంతువుల్లో ఎక్కువ కాలం గర్భాన్ని మోసి,సంతానాన్ని కన్నే జంతువు ఆవు మాత్రమే- ఏ జాతి తల్లికైనా పాలులేనప్పుడు ఆ సంతానాన్ని తన పాలతో బతికించేది ఈ ఆవు మాత్రమే.అందుకే 'అమ్మా-ఆవు!.అంటూ పాఠా లు ప్రారంభిస్తాం. ఈ ఆవు జాతిని లోకాని కుదిరించేది ఆ ఎద్దు మాత్రమే నాన్న అయిన ఎద్దు-పంటను తెస్తే,అమ్మ అయిన ఆవు సంతానాన్ని కని,పాల నిస్తూ పోషిస్తూంటే-ఆ పాడి పంటలతో బతికేవాళ్లం మనం. ఈ రెండూ అవసరం మని గుర్తించిన పెద్దలు' ఆవుకు, ఎద్దుకూ కలిపి ఒకే పేరు పెట్టారు-'గౌః'అని. అసలామాటకొస్తే గోశబ్దానికి పదిఅర్థాలున్నాయి. అంత గొప్పదైన 'ఎద్దు' మనింటికి వచ్చింది. కోరిన కోరికల్ని అలా వర్షించగల శక్తి దీనికి ఉండబట్టి 'వృషభ'మని పేరు (వర్షతీతి). ఎలా వచ్చిందిట ఈ శక్తి? కామధేనుసంతానం కదా మరి! సరే!

**హరిదాసూ - కీర్తనలవిశేషం**

ఈ బహుమానాన్ని పొంది, ఆ ఎద్దు అలా వెళ్లగానే, తలమీద గుండ్రని మంచిగుమ్మడి ఆకారపుగిన్నెను ధరించి, నుదుట ఊర్ధ్వపుండ్రాలు ధరించి, శ్రావ్యంగా పాడుతూ, చేతిలో చిడతలతో హరిదాసు రానే వస్తాడు. ఇతను ఈ నెలకాలమూ వస్తూనే ఉంటాడు. తెలతెలవారుతూ ఉన్నకాలంలో లేస్తుండగానే హరినామకీర్తనం వినడం అదృష్టం. ఇక ఆ హరిదాసునెత్తిమీద పండుగుమ్మడికాయ ఆకారంలోనూ, అదే రంగులోనూ కన్పిస్తూ ఉండే ఆ గిన్నె, భూమికి సంకేతం. ఆ భూమి నుంచి గాదె నిండుగా ఇంటికి ధాన్యాన్ని తెచ్చుకున్నమనం, మళ్లీ ఆ ధాన్యాన్ని బూమి ఆకారంలో ఉన్న హరిదాసుపాత్రలో వేయడం మనేది, మలిపంట కోసం విత్తనాల్ని చల్లుతున్నదానికి సంకేతం. కొద్దిగా ధాన్యాన్ని భూమిలో వేస్తే - తిరిగి అదేభూమి ఎన్నో వేలరెట్ల ధాన్యాన్ని మనకు ఇస్తోంది - ఇచ్చిందీ గదా! ఆ ప్రత్యుపకారబుద్ధినీ- కృతజ్ఞతాభావాన్నీ గుర్తించుకునేలా చేయడమే ఈ హరిదాసు చేసేపని. వట్టిగా గిన్నెని పట్టుకుని వచ్చి 'బిచ్చం తల్లీ!' అని అరవడం కాక - నేటి కాలంలోలా ఓ పిచ్చిచలన 'చెత్త'పు వెఱ్ఱి మొఱ్ఱి పాటను మనముందు మొఱగడం కాక - భక్తిభావంతో కీర్తనను ఆలపించి, మనల్ని అతనిసంగీతంతో తృప్తిపరచి, ధాన్యాన్ని తీసుకుని వెళ్లడం ఎంత చక్కని విధానమో కదా! ఇందాక గంగిరెద్దు రూపంలో శివదాసుడు వస్తే, ఇప్పుడు హరిదాసునిరూపంలో నారదుడు వచ్చాడన్న మాట! అతణ్ణి వస్త్రాలతో సమ్మానిస్తే - ఇతణ్ణి అన్నా నిక్కావలసిన ధాన్యంతో సమ్మానిస్తున్నామన్నమాట.

'అదత్వా మాదృశో మా భూ: దత్వా త్వం త్వాదృశోభవ' ఓ యజమానీ! ఎవరికీ ఇవ్వక పోయినకారణంగా ఇలా ఇంటింటికీ వెళ్లి, యాచించేస్థితిలో నే నున్నాను. ఎప్పుడూ ఇస్తూండే అలవాటున్నకారణంగా మీరు ఇలా ఇచ్చేస్థితిలోనే ఇంకా ఉంటూనే ఉన్నారు' అని ప్రతియాచకుడూ మౌనంగా చెప్తాడట. ఆ విషయాన్ని గుర్తుంచుకోవలసిందిగా హెచ్చరిస్తూ - తానుమాత్రం యాచించడానికి రాలేదని, శ్రావ్యమైనకంఠ ధ్వనితో గోవిందకీర్తనం చేస్తూ ఆ గోవిందనామాన్ని అనునిత్యం జపించుకోవల సిందిగా- కష్టాలను దాటవలసిందిగా - ఈ వచ్చిన హరిదాసు ఓ ఉపాయాన్ని మనకు తెలియజేస్తాడన్నమాట. ఇతణ్ణి నారాయణు నిప్రతినిధి అయిననారదునిగా మనం ఊహిం చుకున్నప్పుడే హరిదాసులోని హరి-దాసుతనం మనకు అర్థం అవుతుంది.

ఇంతలో 'అంబపలుకు జగదంబపలుకు! కంచి లోని కామాక్షీపలుకు, అంటూ డమరుధ్వనితో బుడబుక్కలవాడు వస్తాడు. ఇంటిగాదె నిండుగా ధాన్యం వచ్చాక యజమానులమైన మనం 'అబ్బాయికి దివాణంలో ఉద్యోగం వస్తుందా? అమ్మాయికి మంచిసంబంధం దొరుకుతుం దా?.... అని ఇలా ఆలోచిస్తుంటే, ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు వస్తాడు - ఈ జ్యోతిష్కుడు.

అంబపలుకులూ, జగదంబపలుకులూ కంచి కామాక్షి పలుకులూ తనపలుకులలో సాక్షా త్కరించి, తాను ఈ యజమానికి చెప్పేదంతా నిజమయ్యేలా చేయలవసిందని జోస్యం చెప్పడానికి ముందుగా దేవతల్ని ప్రార్థించి, మరీ చెప్పాడు- ఈ బుడబుక్కలవాడు. నిజానికి జ్యోతిషం అనేది వ్యక్తికి ఉండే వాక్ శక్తిని బట్టి ఫలిస్తుంది. అందుకే జ్యోతిషం చెప్పేవారు దేవతల్ని ఉపాసించాలి. నిజానికి అలా ఉపాసన చేయనివారు చెప్పిన కారణంగా జ్యోతిషం ఫలించకపోతుంటే, ఇలాంటి వాళ్ల వల్ల జ్యోతిశ్శాస్త్రానికి చెడ్డపేరు రావడం సంభవిస్తోంది. ఇంతటి మహా విశేషాన్ని ఈ బుడబుక్కలవ్యక్తి ద్వారా గమనించాలి.

ఈ బుడబుక్కల వానిచేతలో డమరుకమే ఎందుకుండాలి?-అంటే ఈ డమరుధ్వనులు పధ్నాలుగు కారణం గానే లోకానికి సంస్కృతి బాషకు మూలమైన పధ్నాలుగు సూత్రాలను లోకానికి అనుగ్రహించాడు.ఆధ్వనులు శివునిడ మరుకం మీది నుంచీ వచ్చినవే!

ఆ శంకరుని అనుగ్రహమూ, ఈ అమ్మవారిదయా అనే రెండూ తనకు ఉండాలనీ,ఆ కారణంగా తాను చెప్పింది యజమానికి ఫలించి,మరింత బహుమానం తనకు లభించాలనీ బుడబుక్కల వ్యక్తి పాట పాడుతూ వస్తాడు.యజమాని ప్రశ్న లకు సమాధానాలు చెప్పి,బహుమతులు అంది, వెళ్లిపోతాడు. వట్టిగా 'అంబపలుకు..' అంటూ పాడడం కాక,జ్యోతిషశాస్త్రం కూడా తెలిసిన వ్యక్తులే డమరుకం పట్టుకుని సంప్రదాయంగా వస్తూండడం ఇప్పటికీ కొన్నిచోట్ల కన్పిస్తుంది.

ఎప్పుడూ శ్మశానంలో ఉంటూ 'కాటి కాపరి'వృత్తి చేసే ఓ వ్యక్తి నూనె ఒంటినిండా పోసుకుంటూ, గంట వాయించుకుంటూ నెమ్మదిగా తెల్లవారు జామునే వస్తాడు.అతను ఏ ఇంటి ముందు ఆగితే,ఆ ఇంట్లో ఏదో మరణం వంటి అశుభం జరుగుతుందనేది యథార్థం,రాబోయే విషయా లను ఇలా గ్రహించుతూ ఉండేవారు పూర్వకా లంలో చిత్రమైన అంశమే మంటే,ఆ కాటికాపరి కూడా తన వృత్తికి సంబంధించిన ఆపద తనకు రాకుండా ఉండేందుకు యథాశక్తి తానూ తనకు వచ్చినంతలో జపాన్ని చేసుకుంటూనే ఉండే వాడు. అందుకే అలా భవిష్యత్తు చెప్పగలిగిన శక్తి ఉండేవాడు.సరే!

ఇలా ఆ వ్యక్తి రావడం,లేని భయాన్ని కల్గిం చడమే కదా!అని మనకు అన్పించవచ్చు. కాని ఇదొక విధంగా రాబోయేకష్టాన్ని తట్టుకోగల ధైర్యాన్ని తెచ్చుకోవలసినందిగా సూచించడమని అనుకోవచ్చు గదా!ఈ వ్యక్తి చెప్పింది అంత కచ్చితంగా జరుగుతుందా?అనుకో నక్కర్లేదు. ఏదో తోచింది చెప్పేయడం కాకుండా ఎంతో పూజచేసి,ఆ శక్తితో కదా చెప్పాడు- కాటికాపరి. గమనించగలగాలి మనం.

ఇంకా పిట్టలదొరలు-జంగందేవర..మొదలైన ఎందరో వచ్చి తమ తమ గొప్పతనాన్ని వెల్లడించి, బహుమతులంది వెడతారు.ఈ మూడు రోజుల పండుగలోముఖ్యమైన సంక్రాంతి రోజున జరిగే విశేషాలను ఇప్పటి వరకు గమనించాక,ఈ సంక్రాంతి పండుగకు అటూ ఇటూ ఉన్న భోగి-కనుము పండుగలను గూర్చి చూద్దాం!

**భోగిమంట**

సంక్రాంతి ముందు రోజున పెద్ద పెద్ద మంటలు వేస్తారు.ఈ రోజు దాటి,రాబోయే తెల్లవారు జామున సూర్యుడు యథావిధిగా ఉత్తరాయణానికి రాబోతున్నా డని తెలపడానికే పెద్ద అగ్నిరాశిని చలిమంటరూపంలో వేసి,చూపిస్తారు.

లౌకికంగా ఈ చలిమంట వేయడం వల్ల వ్యర్థపదార్థాలన్నీ దీనిలోనికి వెళ్ళిపోతాయి.ఈ మంటకు ఆకర్షించబడి మంచుకు చేరిన ఎన్నో క్రిములు, కీటకాలూ కూడా మంటలో పడి మరణించి, మనకు రోగాల్ని కల్గించనీయవు.ఇక ఇక్కణ్ణించి క్రమక్రమంగా వాతావరణంలో ఉష్ణోగ్రత పెరుగుపోతుందని చెప్పడం కూడా భోగి మంట వేయడంలంలోని రహస్యమే!



చిన్నపిల్లల నెత్తిమీద భోగిపళ్లుపోయడం అను ఆచారం ఒకటుంది.సంస్కృతంలో రేగిపండును 'అర్కఫలమ్'అంటారు. అర్క అంటే సూర్యుడు అని అర్థం.అర్థమే కాదు-ఆకారంలో కూడ రేగిపండు,సూర్యుణ్ణి పోలి వుంటుంది. రేగిపండును సూర్యునికి సంకేతం అనుకున్నాం కదా!ఆ సూర్యశక్తి (ఆరోగ్యం+బుద్ధి)ఈ బిడ్డ శరీరం నిండుగా ప్రసరించుగాక!అని పెద్దలు దీవించడం- కోరుకోవడం భోగిపళ్లు పోయడంలో అంతరార్థం సూర్యుడు తన రాశి మారేవేళ ప్రతి ఇంటి వారుతమ తమ సంతానికిసూర్యుని ఆశిస్సులు లభించి ఆరోగ్యవంతులు, బుద్ధి మంతులు కావాలని కోరుతూ చేసేదే భోగిపళ్ళ పండుగ, ఆరోగ్యం భాస్కరా దిచ్ఛేత్ - ధియో యో నః ప్రయోదయాత్ అనే వాటిని బట్టి సూర్యుడు ఆరోగ్యాన్ని, సద్బుద్ధిని ఇస్తాడని తెలుస్తోంది గదా! అంతవరకూ సంప్రదాయం. ఇక భోగిపళ్ల పేరిట ఆ రేగుపళ్లకి తోడుగా చిల్లరడబ్బులూ... ఇంకే మేమో వస్తువుల్ని జోడించడంలో విశేషంమాత్రం గోచరించదు - సంప్రదాయ ధ్వంసం - కొత్త కాలపుప్రజల 'వేడుక' తప్ప.

**కనుమపండుగ**

మనకు నిత్యజీవితంలో ఎంతో ఉపయోగ పడుతూ, నిరంతరం మనకు సేవ చేస్తున్న - మనం పెంచుతున్న ఆవులు, ఎద్దులు, బఱ్ఱెలూ మొదలగుజంతువుల్ని కూడా భగవద్రూపాలుగా భావించి, వాటికీ స్నానం చేయించి, అలం కరించి, పండ్లూ, పొంగలి, తీపిపదార్థాలూ తిని పించి, వాటియందు మనం కృతజ్ఞతాగుణాన్నీ, ప్రేమనూ చూపడం - ఈ పండుగ విశిష్టత. పశువులకొట్టాలు కట్తారుకూడా! ఇది సహజీవులపై చూపే ప్రేమాదరాలకు సంకేతం! అంతేకాదు, రోజులోకూడా రాత్రిని దక్షిణా యనం గానూ- పగటిని ఉత్తరాయణంగానూ చెప్తారు. ఎవరు మరణించినా సూర్యాస్తమ యంలోనూ దహనక్రియలు ముగించడానికి కారణంకూడా ఉత్తరాయణ పవిత్రతను దృష్టిలో ఉంచుకునే! ఈ చలికాలానికి ఆరోగ్యం చెడకుండా ఉండేం దుకై సజ్జలరొట్టెల్నీ నువ్వులచెక్కల్నీ చేసి తినిపిస్తారు. సంక్రాంతి మూడురోజుల పండుగగా అయిన మరునాటి 'ముక్కనుము' అంటారు. ఈ రోజున ప్రతిఇంటివాకిటా 'రథంముగ్గు'ను వేయడం సంప్రదాయంగా వస్తోంది. ప్రతి వ్యక్తిశరీరమూ ఒక రథ మనీ, దాన్ని నడిపేవాడు ఆ పరమాత్మ అనీ భావిస్తూ-ఈ నా శరీర మనేరథాన్ని సరైనత్రో వలో సరైన వేగంలో నడిపించవల సినదిగా పర మాత్మను ప్రార్థించడం ఈ ముగ్గులోనిరహస్యం. ఇలా ప్రాచీనులు ఏర్పాటు చేసిన పండుగల్లో ఆధ్యాత్మిక-లౌకిక- విజ్ఞాన- వైద్యశాస్త్ర విషయాలతోపాటు- సంప్రదాయం కూడా దాగి ఉంది. కాబట్టి వీటిల్ని చెడి పోకుండా- అర్థాన్ని తెలుసుకుని ఆచరించడం - అందరికీ అంతరార్థం తెలిసేలా ప్రచారసాధనాలు ప్రచారం చేయడం కనీసకర్తవ్యమూ - బాధ్యతాకూడా!

**ముక్కనుమ అంటే ఏమిటి.**

**కనుమ అంటే పశువుల పండగ**

మూడవ రోజున కనుమ రోజున తమ పొలాలలో నిరంతరం శ్రమించే పశువులను గౌరవించి మన జీవన ప్రయాణంలో వాటి సహాయం లేనిదే మనిషికి మనుగడ లేదు కాబట్టి కృతజ్ఞత భావంతో రైతులు ఉదయాన్నే పశువులను, వాటి పాకలను శుభ్రంగా కడిగి అలంకరించి పూజలు చేస్తారు. వాటికి ఇష్టమైన వాటిని తినిపిస్తారు. ఈ రోజు ప్రయాణాలను అశుభంగా భావిస్తారు. మొదటి మూడు రోజుల్లోనూ పొంగలితో పాటు, సకినాలు, చేగోడిలు, కారపూస, అరిసెలు, అప్పాలు, నువ్వుల ముద్దలు మొదలైన పిండి వంటలు చేసి తిని ఆనందిస్తారు.

గాలిపటాల సందడి

సంక్రాంతి పండుగ వస్తోందంటే చాలు గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలో చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా గాలిపటాల ( పతంగుల )ను ఎగురవేసి ఆనందిస్తారు. ఈ పండుగ రోజులలో ప్రతిరోజూ వేకువ జామునవే హరిదాసులు సంకీర్తనలు చేస్తూ ప్రతి ఇంటికి తిరిగి దానములు స్వీకరిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు. ఇక గంగిరెద్దులవారు ఎద్దులకు ఆకర్షణీయ దుస్తులు, రంగులు వేసి వాటిని ఇంటి ముందుకు తెచ్చి పాటలు పాడి దానం స్వీకరిస్తారు.

నుమ రోజు మాంసాహారం తినొచ్చా..?

కొంత మంది కనుమ రోజు మాంసాహారం తినవచ్చునని అనుకుని వారికి వారే కల్పించుకుని తినేస్తుంటారు. అది ఎంత మాత్రం సరైనది కాదు. మన భారతీయ హిందూ సంస్కృతి చాలా గొప్పనైనది. సంస్కృతి అంటే బాగుచేయునది అని అర్థం. అనాది నుండి ప్రధానమైనది మతం - హిందూ మతము భాయాం రతా: ొ భారతా.. అనగా ఆత్మజ్ఞానము నందు ఆసక్తులైనవారు అని భావం. భారతీయ సంస్కృతి అంటే వైదిక లేక సనాతనమైనదని దానికి సంబంధించినదే వాఙ్మయం, లలితకళలు, ఆచార వ్యవహారాములు. నియమాలు, కట్టుబాట్లు అనేవి వీటి పరిదిలోకి వస్తాయి.


ఉత్తరాయణం వైపు ప్రయాణం చేయనున్న సూర్యుడు

ఈ మకర సంక్రాంతితో సూర్యభగవాణుడు ఉత్తరాయణం వైపు ప్రయణం చేయడాన్నే ఉత్తరాయణ పుణ్యకాలం అంటారు. భోగి, సంక్రాంతి, కనుమ అనేవి దైవాన్ని , ప్రకృతిని, పశు పక్షాదులను అంటే మన జీవించడాని సహయపడిన ప్రాణులను గౌరవించి వాటిని పూజించుకునే గొప్పనైన సంస్కృతిని మన పూర్వీకులు మనకు ఆచరించి తెలియజేసారు. కాలం మారుతున్నకొద్ది మన సనాతన సంస్కృతి సాంప్రదాయలను మరచిపోతున్నాం. ఇది ఎంత వరకు మంచిది ఒకసారి ఆలోచించాలి.

**ఆరోగ్య సూత్రాలు దృష్టిలో ఉంచుకుని...**

కనుమ అంటే పశువులను గౌరవించి పూజించే పండగా అని చెప్పుకుంటాం. అంటే సాటి ప్రాణులను గౌరవించే సంస్కారం మనలో దైవత్వం ఉంటేనే వస్తుంది. అంతలోనే మాంసాహారం తినడంలో ఎంతవరకు న్యాయమో ఆలోచించాల్సి ఉంది. మన పెద్దలు పూర్వీకులు మన ఆరోగ్య సూత్రలను దృష్టిలో పెట్టుకుని ఆయా పండుగలలో ఆహార నియమాలను పాటించేలా చేసారు. వాటిని పెడచెవిన పెడితే ఎవరికి నష్టమనేది ఆలోచించాలి. భోగి, సంక్రాంతి, కనుమ అనే మూడు రోజుల పండగలలో మాంసాహార భక్షణ చేయాలనే నియమం ఎక్కడ లేదు. ఇది కేవలం వ్యక్తిగతంగా కల్పించుకున్నదే!

# సంక్రాంతి శుభాకాంక్షలు






## ఎంపీ టికెట్‌పై వైసీపీ అభ్యర్థుల మార్పు



విశాఖపట్నం,అమరావతి: ఏపీ సీఎం జగన్ చేపట్టిన అభ్యర్థుల మార్పు ప్రక్రియ వైసీపీకి కొత్త తలనొప్పులను తెచ్చిపెడుతోంది. టికెట్ రాదని తెలిసి కొందరు పార్టీ మారుతున్నారు. మరికొందరేమో ఒక నియోకవర్గంలోని అభ్యర్థులు మరొక నియోజకవర్గంలో పోటీ చేయడానికి ఆసక్తి కనబర్చడం లేదు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఈ కోవలోకే వస్తారు. గత లోక్‌సభ ఎన్నికల్లో శ్రీకృష్ణదేవరాయలు వైసీపీ తరఫున నరసరావుపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఆయన అక్కడి నుంచే పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. కానీ సీఎం జగన్ మాత్రం ఆయనను గుంటూరు నుంచి పోటీ చేయాలని ఒత్తిడి తెచ్చారు. శ్రీకృష్ణ దేవరాయలకు నరసరావుపేట ఎంపీ టికెట్ ఇవ్వమని చెప్పారు. అయితే తాను గుంటూరు నుంచి అయితే పోటీ చేయనని, నరసరావుపేట నుంచి అయితనేనే పోటీ చేస్తానని, లేదంటే ఎన్నికల బరి నుంచి తప్పుకుంటానని శ్రీకృష్ణ దేవరాయలు వైసీపీ అధిష్టానానికి చెప్పారు. సీఎం జగన్ మాత్రం శ్రీకృష్ణ దేవరాయలు మాటను వినిపించుకోకుండా పంతానికి పోయారు.

కానీ ఐప్యాక్ సర్వేతో వైసీపీ అధిష్టానం మళ్లీ మనసు మార్చుకుంది. నరసరావు టికెట్‌పై రివర్స్ స్టాండ్ తీసుకుంది. శ్రీకృష్ణ దేవరాయాలకే నరసరావుపేట ఎంపీ టికెట్ ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో వైసీపీ అధిష్టానం ఆయనను బుజ్జగించే పనిలో పడింది. మొన్న వద్దన్నవారే నేడు బతిమాలాడుతున్నారు. ఇవ్వనన్న సీట్ మళ్లీ ఇస్తామని రమ్మంటున్నారు. వైసీపీ అధిష్టానంలో ఈ మార్పునకు ఐప్యాక్ ఇచ్చిన సర్వే రిపోర్టే కారణం. నరసరావుపేట ఎంపీ టికెట్ శ్రీకృష్ణదేవరాయాలకు ఇస్తేనే గెలుస్తామని ఐప్యాక్ సర్వేలో తేలింది. దీంతో నరసరావు పేట ఎంపీ నియోకవర్గ పరిధిలోని శాసనసభ్యులు అధిష్టానం వద్దకు వెళ్లి టికెట్ శ్రీకృష్ణదేవరాయాలకే ఇవ్వాలని సీఎంపై ఒత్తిడి తెచ్చారు. దీంతో వెసీపీ అధిష్టానం మనసు మార్చుకుంది. నరసరావుపేట ఎంపీ సీటు బరిలో శ్రీకృష్ణదేవరాయాలనే ఉంచాలని నిర్ణయించింది. దీంతో ఆయనను ఒప్పించే పనిలో పడింది. అయితే మొదట తనకు నరసరావు పేట టికెట్ ఇవ్వనని చెప్పడంతో ప్రస్తుతం శ్రీకృష్ణదేవరాయలు ఆగ్రహంతో ఉన్నారు. దీంతో శ్రీకృష్ణదేవరాయాలను ఒప్పించేందుకు వైసీపీ నేతలు, ఎమ్మెల్యేలు ఆయన వద్దకు క్యూకట్టారు. స్వయంగా ఎంపీ విజయసాయి రెడ్డి నుంచి నేతలు రాయబారం నడుపుతున్నారు. ఒకసారి సీఎం వద్దకు రావాలని శ్రీకృష్ణదేవరాయాలపై ఒత్తిడి తెస్తున్నారు. కానీ ఆయన సీఎం వద్దకు వచ్చేందుకు నిరాకరించారు. గత రాత్రి శ్రీకృష్ణదేవరాయలు కుటుంబంతో కలిసి సినిమాకు వెళ్లారు.

అక్కడ కూడా ఆయనను ఐప్యాక్ బృందం షాడోలా వెంటాడింది. చివరగా ఈ విషయంలో ఏం జరుగుతుందో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

## ఉద్యోగులకు షాకిచ్చిన సిటి బ్యాంక్..



అమెరికాలోని ప్రముఖ బ్యాంక్ ఉద్యోగులకు షాకింగ్ వార్త చెప్పింది. రాబోయే రెండేళ్లలో 20,000 మంది ఉద్యోగులను లేదా దాదాపు 10% మంది ఉద్యోగులను తొలగించాలని సిటీ గ్రూప్ యోచిస్తోంది. కంపెనీ పునర్వవస్థీకరణలో భాగంగా రాబడులను పెంచేందుకు వాల్ స్ట్రీట్ దిగ్గజం సిటీ గ్రూప్ 2024లో ఉద్యోగాలను తగ్గించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. 2023 నాల్గవ త్రైమాసికంలో 1.8 బిలియన్ డాలర్ల నష్టాలను ఆ కంపెనీ శుక్రవారం నివేదించింది.

అయితే ఆదాయం గత సంవత్సరంతో పోలిస్తే 3% తగ్గి %వి%17.4 బిలియన్లకు చేరుకుంది. తొలగింపుల వల్ల బ్యాంకుకు 2.5 బిలియన్ల డాలర్ల వరకు ఆదా అయ్యే అవకాశం ఉంది. "ముఖ్యమైన అంశాల ప్రభావం కారణంగా నాల్గవ త్రైమాసికం చాలా నిరాశాజనకంగా ఉన్నప్పటికీ, సిటీని సరళీకృతం చేయడంలో, 2023లో మా వ్యూహాన్ని అమలు చేయడంలో మేము గణనీయమైన పురోగతి సాధించాము" అని సిటీ గ్రూప్ %జజూ% జేన్ ఫ్రేజర్ అన్నారు.

సిటీ తొలగింపులు 2026 నాటికి దాని ఉద్యోగుల సంఖ్యను 180,000కి తీసుకువస్తాయని సిటీ గ్రూప్ ప్రతినిధి పేర్కొన్నారు. గత ఏడాది చివర్లో బ్యాంక్‌లో దాదాపు 10% సీనియర్ మేనేజర్ స్థాయి వారిని తొలగించారు. సిటీ గ్రూప్ రాబడిని మెరుగు పర్చడం లక్ష్యంగా 2023 సెప్టెంబర్ లో భారీ మార్పులు శ్రీకారం చుట్టింది. ఉద్యోగాల తొలగింపుతో బ్యాంక్ దాని లాభాల లక్ష్యాలకు చేరువయ్యే అవకాశం ఉంది.

ఆర్థిక సంస్థలు తమ స్టాక్ ధరలలో క్షీణతతో కూడిన గందరగోళ సంవత్సరం నుంచి కోలుకోవడానికి ప్రయత్నిస్తున్నందున సిటీ బ్యాంక్ సంస్థాగత సమగ్ర మార్పు వచ్చింది. ఫోర్బ్స్ ప్రకారం యూఎస్ లోని 15 అతిపెద్ద బ్యాంకులు గత ఆగస్టులో ఒక్క రోజులో 46 మిలియన్ డాలర్లకు పైగా విలువను కోల్పోయాయి.

## 'అమరావతి'కి గుడ్ న్యూస్



విశాఖపట్నం, అమరావతి:భారతీయ రైల్వే ప్రయాణికులకు, ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని రైల్వే ప్రయాణికులకు మంచి శుభవార్త. కొన్నాళ్లుగా విజయవాడ నుంచి హుబ్లీ మధ్య నడుస్తోన్న అమరావతి ఎక్స్ ప్రెస్ రైలును నర్సాపూర్ వరకు పొడిగించారు. ఈ పొడిగించిన రైలును కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వర్చువల్ గా ప్రారంభించారు. విజయవాడ-నరసాపూర్ మధ్య డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి.

వాస్తవానికి అమరావతి ఎక్స్ ప్రెస్ ను గత నవంబరు నుంచే నరసాపూర్ నుంచి నడుపుతున్నారు. అప్పట్లోనే కిషన్ రెడ్డిచేత ప్రారంభించడానికి ప్రయత్నించినప్పటికీ ఆయన బిజీగా ఉండటంతో కుదర్లేదు. అప్పటినుంచే నరసాపూర్ నుంచి నడవాల్సిన రైలును విజయవాడ నుంచే నడుపుతున్నారు. స్థానిక బీజేపీ నాయకులు ఈ విషయాన్ని కిషన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వర్చువల్ గా ప్రారంభించేందుకు ఒప్పుకున్నారు.

17225 నెంబర్‌తో మధ్యాహ్నం 3.00 గంటలకు నరసాపురంలో బయలుదేరి విజయవాడ, గుంటూరు, మార్కాపురం, నంద్యాల, గుంతకల్, బళ్లారి, హొస్పేట మీదుగా తర్వాతరోజు ఉదయం 11.20 గంటలకు హుబ్లీ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 17226 నెంబర్‌తో హుబ్లీలో బయలుదేరి తర్వాతరోజు ఉదయం 7.00 గంటలకు నరసాపురం వస్తుంది. పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం రోడ్, గిద్దలూరు, కంభం, నంద్యాల, డోన్, పెండేకల్లు, గుంతకల్, బళ్లారి, తోరణగల్లు, హాస్ పేట, మునిరాబాద్, కొప్పల్, గదగ్, అన్నిగెరి స్టేషన్లలో ఆగుతుంది.

గోవా వెళ్లేవారికి ఈ రైలు ఎంతో ప్రయోజనకారిగా ఉండనుంది. కొన్ని బోగీలను హుబ్లీలో వేరు చేసి హైదరాబాద్ నుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్‌కు కలుపుతారు. తిరుగు ప్రయాణంలో హైద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌కు గోవాలో జత చేసి వాటిని హుబ్లీలో అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు కలుపుతారు. దీనివల్ల మరో రైలు మారాల్సిన అవసరం ఉండదు. రాయలసీమ, కర్ణాటక ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఈ రైలు ఎంతో సౌకర్యవంతంగా ఉండనుంది





















# నెల్లూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

విశాఖసమాచారం,నెల్లూరు:ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దొరవారి సత్రం మండలం, కలగుంట వద్ద జాతీయ రహదారిపై బైకును గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో బైకుపై వెళుతున్న ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. నాయుడుపేట నుంచి చెన్నై వైపు వెళుతుండగా ఈ ఘటన జరిగింది. మృతిచెందిన వారిలో మునిరాజా (24), రామ్‌కి (25), గౌతమ్ (23). సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## శ్రీశైలంలో కన్నులపండువగా సంక్రాంతి బ్రహ్మోత్సవాలు



విశాఖసమాచారం,నంద్యాల: శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని సంక్రాంతి బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. మూడవ రోజు ఆదివారం ఉదయం స్వామి అమ్మవార్లకు విశేషపూజలు నిర్వహిస్తున్నారు. శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామివారు రావణ వాహనంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. సాయంత్రం స్వామి అమ్మవార్లకు శ్రీశైలం పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

బ్రహ్మోత్సవాలలో భాగంగా 15వ తేదీ (సోమవారం) మకరసంక్రాంతి పర్వదినం రోజున నందివాహనసేవ, స్వామి, అమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం, 16వ తేదీన కైలాసవాహనసేవ, 17 వతేదీన యాగపూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, సదస్యం, నాగవల్లి, ధ్వజావరోణ కార్యక్రమాలు, 18 వ తేదీన రాత్రి జరిగే పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవలతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఈ నెల 12 నుంచి 18 వరకు ఆర్జిత, ప్రత్యక్ష, పరోక్షసేవలైన రుద్రహోమం, చండీహోమం, మృత్యుంజయహోమం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, స్వామి, అమ్మవార్ల కల్యాణం, ఏకాంతసేవలను నిలుపుదల చేశారు.

# భోగి వేడుకల్లో మంత్రి అంబటి డ్యాన్స్..



విశాఖసమాచారం,పల్నాడు :తెలుగు రాష్ట్రాల్లో భోగి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. ముఖ్యంగా ఏపీలో ప్రతీ పల్లె, పట్టణ ప్రాంతాల్లో భోగి మంటలు వేసి ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు. రాజకీయ, వివిధ రంగాల ప్రముఖులు తెల్లవారుజామునే భోగి మంటలు వేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో పల్నాడు జిల్లా, సత్తెనపల్లి, గాంధీ బొమ్మల సెంటర్లో మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు వేసి దాని చుట్టూ తిరుగుతూ డ్యాన్స్ చేశారు. ఈ వేడుకల్లో స్థానిక కౌన్సిలర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి 'సంబరాల రాంబాబు.. అంబటి రాంబాబు' అనే ప్రత్యేక పాటకు స్టెప్పులు వేశారు.

# తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ



కలియుగ వైకుంఠం తిరుమలలో భక్తుల రద్దీ భారీగా తగ్గింది. స్వామివారి దర్శనం త్వరగానే అవుతోంది. కంపార్ట్ మెంట్లు, క్యూలైన్లు దాదాపు ఖాళీగానే ఉన్నాయి. వచ్చిన భక్తులు వచ్చినట్లుగానే తిరుమల శ్రీవారిని దర్శించుకుంటున్నారు. సర్వదర్శనం త్వరగానే జరుగుతోంది. ఇక ప్రత్యక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్న భక్తులకు స్వామివారి దర్శనానికి గంట నుంచి 2 గంటల సమయం పడుతోంది.

తిరుమల శ్రీవారిని శనివారం రోజున 65 వేల 692 మంది దర్శించుకున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. ఇందులో 24,575 మంది భక్తులు తలనీలాలు సమర్పించినట్లు పేర్కొన్నారు. శనివాం స్వామి హుండీ ఆదాయం రూ.3.78 కోట్లుగా వచ్చింది. సంక్రాంతి సందర్భంగా దాదాపు అందురు ఊళ్లకే పరిమితం కావడంతో తిరుమలలో భక్తుల రద్దీ తగ్గినట్లుగా అధికారులు చెబుతున్నారు. రెండు, మూడు రోజులు రద్దీ సాధారణంగా ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

మరోవైపు తిరుమలలో భోగీ సంబరాలు ప్రారంభమయ్యాయి. తిరుపతి శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయంలో వద్ద టీటీడీ అధికారులు, ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, భక్తులు భోగి మంటలు వేశారు. భోగీ పండుగ సందర్భంగా సాయంత్రం 5.30 నుండి రాత్రి 7 గంటల వరకు శ్రీ ఆండాళ్ అమ్మవారు, శ్రీకృష్ణస్వామివారిని భోగితేరుపై కొలువుదీర్చి ఊరేగింపు నిర్వహిస్తారని టీటీడీ అధికారులు తెలిపారు.

శనివారం తిరుమలలో డ్రోన్ కలకలం రేగింది. ఘాట్‌రోడ్డు 53వ మలుపు వద్ద నిబంధనలకు విరుద్ధంగా డ్రోన్ సాయంతో అస్సాంకు చెందిన ఇద్దరు తిరుమల కొండలను వీడియో తీశారు. విషయం తెలుసుకున్న విజిలెన్స్ అధికారులు వారిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. తిరుమలోభద్రతా కారణాల దృష్ట్యా తిరుమలలో ఎటువంటి డ్రోన్లు ఉపయోగించేందుకు అనుమతిలేదని అధికారులు స్పష్టం చేశారు.

# తాజ్ మహల్ కంటే మెరుగ్గా అయోధ్య మసీదు..



విశాఖసమాచారం,లక్నో: అయోధ్యలో నిర్మించతలపెట్టిన మసీదు నిర్మాణానికి సంబంధించి బీజేపీ నేత హజి అర్ఫత్ షేక్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. మసీదు నిర్మాణం ఆగ్రాలో ఉన్న తాజ్ మహల్ కంటే అద్భుతంగా ఉంటుందని ఆయన వివరించారు. లఖ్ నవూ: అయోధ్యలో నిర్మించతలపెట్టిన మసీదు నిర్మాణానికి సంబంధించి బీజేపీ నేత హజి అర్ఫత్ షేక్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. మసీదు నిర్మాణం ఆగ్రాలో ఉన్న తాజ్ మహల్ కంటే అద్భుతంగా ఉంటుందని ఆయన వివరించారు. అయోధ్యలోని వివాదాస్పద రామజన్మభూమి-బాబ్రీ మసీదు స్థలంలో రామ మందిర నిర్మాణానికి సుప్రీంకోర్టు అనుమతిస్తూ పట్టణంలోని మరో చోట కొత్త మసీదు నిర్మాణానికి సున్నీ వక్ఫ్‌బోర్డుకు ఐదెకరాల స్థలం కేటాయించాలని న్యాయస్థానం.. కేంద్రాన్ని గతంలో ఆదేశించింది. మసీదు నిర్మాణం కోసం ఉత్తర ప్రదేశ్ సర్కార్ స్థలాన్ని కేటాయించింది. భారత్‌లోనే అతిపెద్ద మసీదుగా చెబుతున్న ఈ ప్రాంగణంలో 21 అడుగుల ఎత్తు, 36 అడుగుల వెడల్పుతో ప్రపంచంలోనే అతిపెద్ద ఖురాన్ ఉంటుందని షేక్ తెలిపారు. ఈ మసీదు తాజ్‌మహల్ కంటే అద్భుతంగా ఉంటుందని చెప్పారు.

కేవలం నమాజ్ చేసేందుకే కాకుండా ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు 500 పడకల క్యాన్సర్ ఆసుపత్రి ఉందని తెలిపారు. క్యాన్సర్ చికిత్స కోసం రాష్ట్రం నుంచి ఎవరూ ముంబయి తదితర నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పారు. మసీదు ప్రాంగణంలో పలు దంత, వైద్య, ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయని వెల్లడించారు. అన్ని మతాలు, కులాల ప్రజలు భోజనం చేసే వెసులుబాటు ఉందని, ఒకేసారి 5 వేల మంది భోజనం చేయవచ్చని వివరించారు. అయోధ్యలో మసీదును నిర్మాణం కోసం ఉత్తరప్రదేశ్ సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేసిన ట్రస్ట్ IICF అధ్యక్షుడు జుఫర్ అహ్మద్ ఫరూఖీ.. షేక్‌ను నియమించారు.

ఆయన గత సంవత్సరం IIFC లో ట్రస్టీగా, దాని సలహాదారుల్లో ఒకరిగా నియమితులయ్యారు. మహారాష్ట్ర స్టేట్ కమిషన్ ఫర్ మైనారిటీ మాజీ చైర్‌పర్సన్ అయిన షేక్, మసీదు మస్జిద్-ఎ-అయోధ్య పేరును మహమ్మద్ బిన్ అబ్దుల్లా మసీదుగా మార్చారు. మసీదు నిర్మాణం కోసం ఐఐఎఫ్‌సీ ఫిబ్రవరి - మార్చి నెలల్లో ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరిస్తుందని షేక్ తెలిపారు. అయోధ్య రామమందిర నిర్మాణం కోసం విశ్వహిందూ పరిషత్ దేశ వ్యాప్తంగా 45 రోజులపాటు విరాళాలు సేకరించి రూ.2,100 కోట్లు వసూలు చేసింది.

# ఇళ్ల కొనుగోలుదారులకు రెరా శుభవార్త..

దేశీయ రియల్ ఎస్టేట్ రంగం ప్రస్తుతం వేగంగా వృద్ధి చెందుతోంది. శ్రీమంతుల దగ్గర నుంచి పేద, మధ్యతరగతి ప్రజలు సొంతిల్లు కొనుక్కునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే వారిని మరింత ప్రోత్సహించేందుకు రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ ఓ కీలక నిర్ణయం తీసుకుంది.

సొంతిల్లు కలిగి ఉండాలనేది దాదాపు ప్రతి ఒక్కరి కల. దీంతో పలువురు బిల్డర్స్‌ను ఆశ్రయిస్తున్నారు. కొన్ని కారణాల వల్ల బిల్డర్ వద్ద ఇంటి కొనుగోలుకు చేసిన బుకింగ్‌ను రద్దు చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. అప్పుడు ప్రారంభంలో చెల్లించిన బుకింగ్ అమౌంట్‌లో క్యాన్సిలేషన్ రుసుము, ఒప్పంద ఉల్లంఘన జరిమానా రూపేణా భారీ మొత్తాన్ని బిల్డర్ వసూలు చేస్తారు.

కాగా ఇప్పుడు రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ సరిగ్గా ఇక్కడే ఉపశమనం కలిగించే ప్రకటన ఒకటి చేసింది. గృహ కొనుగోలుదారుల ప్రయోజనాల కోసం కొత్త రూల్ అమలుచేస్తున్నట్లు చెల్లిపంది. ఇంతకుముందు వరకు బిల్డర్లు ఇంటి మొత్తం ఖర్చులో 10 శాతాన్ని బుకింగ్ రద్దు ఛార్జీలుగా వసూలు చేసేవారు. దీనిద్వారా కొనుగోలుదారులు పెద్ద మొత్తంలో నష్టపోతున్నట్లు రెరా గుర్తించింది. దీంతో తాజా నిబంధనల ప్రకారం ఆ ఛార్జీని కేవలం 2 శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. అంటే ఇంటి బుకింగ్ రద్దు చేస్తే బిల్డర్‌కు చెల్లించాల్సిన నష్టపరిహారం.. మొత్తం ధరలో కేవలం 2 శాతం మాత్రమేనని స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధన వల్ల గృహ కొనుగోలుదారులకు చాలా మొత్తం ఆదా అవుతుందని రెరా తెలిపింది.



















# విశాఖకు మరో మణిహారంమెట్రో రైలు

విశాఖపట్నం, విశాఖసమాచారం: మన విశాఖ నగర ప్రజా రవాణా లో రారాజు 'మెట్రోరైల్ ' త్వరలో మొదలై, మన విశాఖ రూపురేఖలనే మార్చబోతోంది.

ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్న విశాఖపట్నం మెట్రోరైల్ ప్రాజెక్టు త్వరలోనే సాకారం కాబోతోంది.

నగరం మధ్యలో తిరిగే మెట్రో రైలు వలన నగర ప్రజలకు సుఖవంతమైన ప్రయాణమే కాకుండా, ఎన్నో విధముల ప్రయోజనకరం. మెట్రో రైలు లో ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి అత్యంత వేగంగా, సకాలంలో చేరుకోవచ్చు. దీని వల్ల ఎంతో సమయం ఆదా అవుతుంది. కాలుష్య రహిత, అత్యంత సురక్షితమైన ఈ రవాణా వ్యవస్థ ప్రజలకు అందుబాటు ధరలలో ఉండేటట్లు రూపొందించబడింది.

ప్రపంచవ్యాప్తంగా సుమారు 185 నగరాలలో 570 చోట్ల పటిష్టంగా నడిచే ఈ మెట్రోరైల్ వ్యవస్థ, మన దేశం లో 28 నగరాలలో ప్రారంభించబడి, ఢిల్లీ, ముంబాయి, కలకత్తా, హైదరాబాద్ వంటి 16 నగారాల్లో ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. మరో 12 నగరాలలో నిర్మాణ దశలో వున్నది. అత్యంత ఆధునిక ప్రజా రవాణా వలన, ఆయా నగరాల్లో మరియు నగర శివార్లలో శరవేగంగా ఆర్థికాభివృద్ధి జరిగినట్లుగా నిరూపితమైనది. అందుచే మెట్రోరైల్ వ్యవస్థ 'ప్రజాసంక్షేమ మరియు ఆర్థికాభివృద్ధి' ల మేలి కలయికగా చెప్పవచ్చును. .

విశాఖ నగరాభివృద్ధి కై గౌ . ముఖ్యమంత్రి శ్రీ జగన్మోహన రెడ్డి గారు దృఢ సంకల్పంతో తలపెట్టిన అనేక కార్యక్రమాల్లో ఈ ప్రజా సంక్షేమాభివృద్ధికి ప్రతిక అయిన విశాఖపట్న మెట్రో రైల్ రవాణా వ్యవస్థ' తలమానికం కాబోనుంది.

VIZAG METRO అనే బ్రాండు నేమ్ లో విశాఖపట్నం మెట్రోరైల్ మొత్తం 76.90KM నెట్వర్క్ గా నాలుగు కారిడార్లుగా నిర్మాణం జరగనుంది. మొత్తం 54 మెట్రో స్టేషన్లు, ముఖ్యంగా నగరంలో ప్రతి కిమీ. పరిధిలో ఒక స్టేషన్ ప్రయాణికుల సౌఖర్యార్థం నిర్మించేందుకు నిర్ణయించడమైనది.

**కారడార్ 1**: స్టీల్ ప్లాంటు ఇంకి నుండి కొమ్మాది వరుకు. 34,40 29

**కారిడార్ 2:** గురుద్వార నుండి పాత పోస్టాఫ్స్. 5.07 4 ఈ స్టేషన్లు.

**కారిడార్ 3**: తాటి చెట్ల పాలెం నుండి.

కారిడార్ 4: కొమ్మాది నుండి భోగాపురం ఎయిర్ పోర్టు వరకూ 30.67కి.మి. 12 ఫ్లైఓవర్లుగా విస్తరించబడిన ఈ అధునాతన రవాణావ్యవస్థ సుమారుగా14, 309 కోట్ల ప్రాజెక్టు వ్యయంతో నిర్మించేదుకు ఆంధ్రప్రదేశ ప్రభుత్వం నిర్ణయించడమైనది.

ప్రాజెక్టు DPR రాష్ట్ర ప్రభత్వ అనుమతితో కేంద్ర ప్రభత్వ ఆమోదానికై పంపబడింది. కావలసిన వనరులన్ని సమకూర్చుకొని త్వరలో నిర్మాణ కార్యక్రమాలు (2024 సంవత్సరంలో) ప్రారంభించి, 2028 సంవత్సరంలో తొలి మెట్రోరైల్ నడిపేందుకు" ఆంధ్ర ప్రదేశ్ మెట్రోరైల్ కార్పోరేషన్ " సన్నాహాలు పూర్తి చేసిందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ యు.జి.యం.రావు, 'విశాఖ సమాచారం' ప్రతినిధితో మాట్లాడుతూ తెలియపరిచారు.



శ్రీ యు.జి.యం.రావు గారు, మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్ర ప్రదేశ్ మెట్రోరైల్ కార్పోరేషన్



## జీవీఎల్ మహా సంక్రాంతి సంబరాలు –2024 దృశ్యమాలిక





## ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వివరాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పోయిన నెలలో అమల్లోకి తెచ్చిన AP ల్యాండ్ టైటిలింగ్ యాక్టు, 2022 (ఆంధ్ర ప్రదేశ్ భూమి హక్కుల చట్టం, 2022) ప్రజల పాలిట యమపాశం కాబోతోంది. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల పాటు ప్రజలతో మమేకమై సేవలు చేసిన రిజిస్ట్రేషన్ వ్యవస్థ, రెవిన్యూ వ్యవస్థ, న్యాయ వ్యవస్థ ఇక ముందు మూతపడబోతున్నాయి.

పైన తెలిపిన చట్టం ప్రకారం భూ ప్రాధికార సంస్థ, టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి (TRO) నియమితమైన తరువాత ప్రజల తాలూకు స్థిరాస్తులన్నీ అట్టి TRO పరిధిలోకి పోతాయి. మీ అమ్మాయికి మీరు పొలం ఇస్తూ దానపట్టా దస్తావేజు వ్రాయించాలంటే TRO నుంచి అనుమతి పొందాలి. మీ అవసరాలకి మీ ఆస్తి అమ్ముకోవాలంటే TRO అనుమతి కావాలి. మీరు బాకీ రాబట్టుకోవడానికి కోర్టు నుంచి తనఖా డిక్రీ పొందితే దాన్ని TRO దగ్గర తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి.

సదరు డిక్రీని అమలుపరచమని కోర్టుకు వెళ్లాలంటే TRO నిరభ్యంతర పత్రం ఇవ్వాలి. మీరు స్థిరాస్తి కొనుక్కుంటే రిజిస్ట్రేషన్ చేయించుకున్న తరువాత దాన్ని TRO దగ్గర తిరిగి నమోదు చేయించుకోవాలి. మీ ఆస్తికి సంబంధించి TRO చేసినదే తుది నిర్ణయం. దానిని మీరు సాధారణ సివిల్ కోర్టులలో సవాలు చేయడం కుదరదు. మీ ఆస్తిని గాని TRO ఎట్టి పరిస్థితులలోనైనా తన వద్దనున్న వివాదాల నమోదు రిజిస్టర్‌లో కనుక చేర్చినట్లైతే సదరు చేరికను మీరు హై కోర్టులో తప్ప క్రింది కోర్టులలో సవాలు చేయడానికి వీలుకాదు.

TRO నియమితమైన తరువాత పెండింగులో ఉన్న దావాలను కూడా TRO పరిధిలో ఉంచి నమోదు చేయించుకోవాలి. మీకు భిన్నంగా ఏదైనా కోర్టు తీర్పు వచ్చిన తరువాత మీరు సదరు తీర్పును పై కోర్టులో అప్పీల్ చేయాలనుకుంటే TRO దగ్గర ముందు నమోదు చేయించుకుని సదరు ధృవపత్రమును సదరు అప్పీలుతో జతపరచి మాత్రమే అప్పీలు చేసుకోగలుగుతారు. పై సందర్భాల్లో TRO గనుక మీ వివాదాన్ని నమోదు చేసి సర్టిఫికెటు ఇవ్వకపోయినట్లైతే మీరు వేసిన దావాకాని, అప్పీలు కానీ చెల్లకుండా పోతాయి.

మీ ఆస్తికి సంబంధించి మీరెవరికైనా పవర్ ఆఫ్ అటార్నీ ఇస్తే సదరు విషయాన్ని TRO దగ్గర నమోదు చేయించుకోవాలి. ఇన్ని మాటలు అనవసరం. మీ ఆస్తికి సంబంధించి ఇక ముందు మీరు ప్రతిక్షణం TRO కనుసన్నల్లో బ్రతకాల్సుంటుంది. సదరు TRO మాత్రం స్థానిక శాసనసభ్యుడు లేదా పార్లమెంట్ సభ్యుడు చేతిలో ఉంటాడు, అధికార పార్టీకి కొమ్ముకాస్తూ. ఇక ముందు ప్రతీ పౌరుడి బ్రతుకు బానిస బ్రతుకుగా మారిపోబోతోంది.

రిజిస్ట్రేషన్ సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు అందరూ కలిసి లక్ష మందికి పైగా చేయలేని పనుల్ని ప్రభుత్వం నియమించబోయే ఏ మాత్రం న్యాయ పరిజ్ఞానం లేని ఐదు లేక ఆరు వందల మంది TROలు చక్కబెట్టగలరనుకోవడం హాస్యాస్పదం.

ఇదెలా అంటే రోగులు ఎక్కువయ్యారని ఆసుపత్రులన్నింటిని మూసేసి పసర మందులిచ్చే, తాయత్తులు కట్టే నాటు వైద్యుల దగ్గరికి రోగాన్ని నయం చేయించడానికి పంపించినట్టవుతుంది. కంటి ముందున్నది పెను ఉపద్రవం. కానుకోకుంటే జరిగేది సకల వినాశనం. ఈ సమస్య ప్రజలందరిది. పరిష్కరించుకోవాల్సిన బాధ్యత గల వారిదే అని బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా న్యాయవాదుల జేఏసీ తెలిపింది.





విశాఖ సమాచారమ్
పాఠకులకు, ప్రకటన కర్తలకు,
శ్రేయోభిలాషులకు, మిత్రులకు,
ఉత్తరాంధ్ర ప్రజలకు
సంక్రాంతి శుభాకాంక్షలు
ఇట్లు
మేనేజర్,
విశాఖ సమాచారమ్
తెలుగు దినపత్రిక



VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839 Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Pardwada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106, VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676